


## మేడ్చల్ జిల్లాలో 12 ట్రేడ్లలో అడ్మిషన్‌లు.. జూన్ 30 వరకు అవకాశం..

- 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం..
- ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల అవకాశం..
- మొత్తం 12 ట్రేడ్లలో సీట్లు అందుబాటులో ఉన్నట్లు ప్రకటన జారీ..
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడి..
- జూన్ 30 చివరి తేదీగా అధికారులు తెలిపారు..

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..

అభ్యర్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా ట్రేడ్‌ను ఎంపిక చేసుకుని, తెలంగాణ ఐటీఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూన్ 30, 2026గా నిర్ణయించినట్లు వెల్లడించారు. నిర్ణీత గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, సీట్ల సమాచారం, ఎంపిక విధానాన్ని, iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే ఫోన్ నెంబర్‌లు: 8985415042, 8500467702, 8185846115 లకు సంప్రదించాలని ప్రభుత్వ ఐటిఐ అల్వాల్ ప్రిన్సిపాల్ పి.శంకరయ్య విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 11:** మేడ్చల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ ఐటీఐ అల్వాల్ ప్రిన్సిపాల్ పి. శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. ఈ విద్యా సంవత్సరంలో వివిధ సాంకేతిక, వృత్తి నైపుణ్యాలకు సంబంధించిన మొత్తం 12 ట్రేడ్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అందులో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ డీజిల్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ అండ్ ఎలక్ట్రికల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యు ఫ్యాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు..


ప్రెస్ నోట్ తేది : 11-06-2026

GOVT. ITI – DEPARTMENT OF TRAINING – GOVT. OF TELANGANA

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఐ.టి.ఐ. సంచు కోర్సులకో చెందుకు ప్రభుత్వ .ఐ.టి.ఐ. అల్వాల్ ప్రిన్సిపాల్ /కన్వీనర్ పి. శంకరయ్య ప్రకటన లో తెలియజేశారు. ఐ.టి.ఐ. అల్వాల్ సుంచ 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించిన క్రింది కోర్సులు కద్దు 1). ఎలక్ట్రీషియన్, 2). ఫిట్టర్, 3).ఎలక్ట్రానిక్ మెకానిక్ 4). మెకానిక్ డీజిల్ 5). ఫ్యాషన్ డిజైన్ & టెక్నాలజీ, 6). సోలార్ టెక్నీషియన్ అండ్ ఎలక్ట్రికల్, 7). మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, 8). ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, 9). ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, 10). బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), 11). అడ్వాన్స్ సీ ఎన్ సి మిషనింగ్ టెక్నీషియన్, 12). మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్. సీట్ల ప్రవేశానికి పదవ తరగత ఉత్తర్ణులన విద్యార్థికు విద్యార్థులు అందరూ iti.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

మొదటి విడత కి సంబంధించిన గడువు తేది : 30-06-2026 వరకు దరఖాస్తులు చేసుకోవుటకు అవకాశం కలదు. వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 8985415042, 8500467702, 8185846115.

అందుబాటులో ఉన్న 12 ట్రేడ్లు:

1. ఎలక్ట్రీషియన్
2. ఫిట్టర్
3. ఎలక్ట్రానిక్ మెకానిక్
4. మెకానిక్ డీజిల్
5. ఫ్యాషన్ డిజైన్ & టెక్నాలజీ
6. సోలార్ టెక్నీషియన్ అండ్ ఎలక్ట్రికల్
7. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెక్ కంట్రోల్ ఆటోమేషన్
8. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మాన్యుఫాక్చరింగ్
9. ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్.
10. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్)
11. అడ్వాన్స్ సీ ఎన్ సి మిషనింగ్ టెక్నీషియన్
12. మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్

పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ సందర్శించండి: iti.telangana.gov.in

ప్రిన్సిపాల్/కన్వీనర్
పి. శంకరయ్య 11/6/2026
PRINCIPAL
Govt. Industrial Training Institute
అల్వాల్, మేడ్చల్ జిల్లా.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



# తెలంగాణలో మరింత విస్తరించిన రుతుపవనాలు

## ఖమ్మం జిల్లా కల్లూరులో 11.1 సెం.మీ. వర్షం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని పలు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉండగా, మరికొన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు వడగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ సూచించింది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, 2 రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని పేర్కొంది. దీనికితోడు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు ఒక ద్రోణి కొనసాగుతున్నట్లు తెలిపింది. ఆ ప్రభావంతో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కల్లూరులో 11.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**నిజామాబాద్ జిల్లాల్లో వడగాలులు..**


నిజామాబాద్ జిల్లాల్లో గురువారం వడగాలులు వీచాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఉష్ణోగ్రత అత్యధికంగా 42.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. 21 జిల్లాల్లో 42.2–42.8 డిగ్రీల మధ్య, నాలుగు జిల్లాల్లో 41–41.8 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. శుక్ర, శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.

### బంజారాహిల్స్ లో HMDA భూముల వేలం..

## ఎకరానికి 99కోట్లతో అమ్మకానికి నోటిఫికేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ప్రభుత్వ భూమి వేలానికి HMDA నోటిఫికేషన్ జారీ చేసింది. ఎమ్మెల్యే కాలనీని ఆనుకొని ఉన్న 8ఎకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిని ఎకరాకు 99 కోట్ల రూపాయల ప్రారంభ ధరగా నిర్ణయించింది. ఈ వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా ఎకరానికి 5కోట్ల రూపాయలు ధరావత్తు(ఈ ఎండీ) చెల్లించాలని కోరింది. జూన్ 19న ప్రీ బిడ్ మీటింగ్, జూలై 2న ఈ వేలం నిర్వహించనున్నారు. ఆసక్తి గల పెట్టుబడి దారులు, ప్రతినిధులు వేలం పాల్గొనవచ్చని తెలిపింది.



# మగపిల్లల మోజు ఇంకా వీడలేదు..

### మారని సమాజ మనస్తత్వంపై సుప్రీంకోర్టు ఆందోళన

- లింగవివక్షపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన
- దేశంలో ఇంకా లింగవివక్ష కొనసాగుతోందన్న ధర్మాసనం
- మగపిల్లల మోజు ఇంకా వీడలేదు..
- సమాజ మనస్తత్వంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డ కోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** లింగవివక్షపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆడపిల్లల పట్ల దేశంలో ఇంకా వివక్ష కొనసాగుతోందని , సమాజంలో నిజమైన లింగ సమానత్వం రావాలని అభిప్రాయపడింది.దశాబ్దాలుగా ఎన్నో అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ మగపిల్లలకు ఉన్న ప్రాధాన్యత ఇంకా పూర్తిగా తగ్గలేదని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆడపిల్లల పట్ల వివక్షను రూపుమాపేందుకు సమాజం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని పేర్కొంది.జనాభా లెక్కల గణాంకాలను ప్రస్తావించిన ధర్మాసనం..1991లో ప్రతి వెయ్యి మంది బాలురకు 945 మంది బాలికలు ఉండగా, 2001లో అది 927కు, 2011లో 919కు పడిపోయిందని గుర్తు చేసింది. ఈ లింగ అసమానత్వం, పిండం, లింగ నిర్ధారణను నిషేధించే ్రాజూచీఋ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో జననాల లింగ నిష్పత్తి జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటం ఆందోళనకరమని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలానికి నిదర్శనమని, తెరవెనుక లింగ నిర్ధారణ ఎంపికలు కొనసాగుతున్నాయని తెలిపింది. బేటీ బచావో బేటీ పఢావో, జననీ సురక్ష యోజన, లాడ్లీ లక్ష్మీ యోజన వంటి పథకాలను

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వాహనదారులకు ఆర్టీఏ గుడ్ న్యూస్..
## ఫ్యాన్సీ నంబర్ల కోసం గడువు పెంపు




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కొత్త వాహనాలు కొనుగోలు చేసే వారికి రాష్ట్ర రవాణా శాఖ ఒక గుడ్ న్యూస్ చెప్పింది. తమ వాహనాలకు నచ్చిన ఫ్యాన్సీ లేదా ప్రత్యేక రిజిస్ట్రేషన్ నంబర్లను రిజర్వ్ చేసుకునే గడువును రవాణా శాఖ పొడిగించింది. వాహనదారుల సౌకర్యార్థం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిజానికి ప్రస్తుతవాహన్ సాఫ్ట్‌వేర్ విధానం ప్రకారం... కొత్త వాహనం కొనుగోలు చేసినప్పుడు ఇచ్చే టెంపరరీ రిజిస్ట్రేషన్ లేదా టీఆర్ (TR) కేవలం 30 రోజులు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అంటే వాహనదారులు నెల రోజుల్లోపే తమకు కావలసిన స్పెషల్ నంబర్లను ఎంచుకోవాల్సి వచ్చేది. కానీ ఇకపై ఆ టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. తాజా నిర్ణయం ప్రకారం... టెంపరరీ రిజిస్ట్రేషన్ జారీ చేసిన తేదీ నుంచి ఏకంగా రెండు నెలల పాటు (60 రోజులు) ఫ్యాన్సీ నంబర్లను ఎంచుకునేందుకు రవాణా శాఖ గడువు ఇచ్చింది. అయితే ఇదే సమయంలో వాహనదారులకు అధికారులు ఒక ముఖ్యమైన హెచ్చరిక కూడా జారీ చేశారు. వాహనం కొనే సమయంలో ఫ్యాన్సీ నంబర్ కావాలని ఆప్షన్ పెట్టుకుని... ఈ రెండు నెలల గడువులోగా దానిని రిజర్వ్ చేసుకోకపోతే మాత్రం నష్టపోక తప్పదు.

-4 లో

# మగపిల్లల మోజు ఇంకా వీడలేదు..

-3 పేజి తరువాయి

ప్రస్తావించిన సుప్రీంకోర్టు..ఇటువంటి కార్యక్రమాలు ఇంకా కొనసాగుతుండటం సమాజంలో బాలికల పట్ల వివక్ష పూర్తిగా తొలగిపోలేదని సూచిస్తోందని పేర్కొంది.

మహిళలు పుట్టుకతోనే బలహీనులు అనే భావనకు ముగింపు పలికి, సమానత్వం, గౌరవం ప్రధాన విలువలుగా నిలవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆడపిల్ల పుట్టాలా వద్దా అనే చర్చే అవసరం లేని సమాజం ఏర్పడాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది.

## వాహనదారులకు ఆర్టీఏ గుడ్ న్యూస్.. ఫ్యాన్సీ నంబర్ల కోసం గడువు పెంపు

-3 పేజి తరువాయి

రెండు నెలల సమయం ముగిసిన వెంటనే వాహన్ సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా ఏదో ఒక సాధారణ నంబర్‌ను మీ వాహనానికి కేటాయిస్తుంది. ఆ తర్వాత నచ్చిన నంబర్ మార్చుకోవడానికి ఎలాంటి అవకాశం ఉండదు.కాబట్టి కొత్త వాహనాలు కొని ఫ్యాన్సీ నంబర్ల కోసం ఎదురుచూస్తున్న వారు ఈ పెంచిన గడువును ఉపయోగించుకుని, వీలైనంత త్వరగా తమకు నచ్చిన నంబర్‌ను రిజర్వ్ చేసుకోవాలని రవాణా శాఖ సూచించింది.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ పెన్ పవర్:
ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం (వరల్డ్ డే అగనిస్ట్ చిల్డు లేబర్) సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర, చేతుల మీదుగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి ఆటంకమని, ప్రతి చిన్నారికి విద్య, రక్షణ మరియు మంచి భవిష్యత్తు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు.ప్రతి సంవత్సరం జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ మరియు వారికి నాణ్యమైన



విద్య అందించాల్సిన అవసరంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులు. వారిని పనుల్లో నిమగ్నం చేయడం వల్ల వారి శారీరక, మానసిక మరియు విద్యా అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. అందువల్ల 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనుల్లోనూ నియమించరాదని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, బాల కార్మికులను గుర్తించి వారికి విద్యా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా బాల కార్మికులను పనుల్లో పెట్టుకోకుండా, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. "బాల్యం చదువుకోడానికి -- పని చేయడానికి కాదు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సాధన సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గిరిజ, సీఎస్ఎం మమత, సంధ్యారాణి, విశ్వజ్యోతి తదితరులు పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం -- ప్రతి చిన్నారికి విద్య, రక్షణ మరియు సంతోషకరమైన బాల్యం అందిద్దాం.

# గూడెం గ్రామంలో ఘనంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: అధికారులు
- గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం: సర్పంచ్ మోతే యాదగిరి గౌడ్
- సర్పంచ్ యాదగిరి గౌడ్ స్పెషల్ ఆఫీసర్ ఏంపిఓ త్రివేద్

హైదరాబాద్ పెన్ పవర్:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామంలో మంగళ వారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడం, గ్రామాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.గ్రామసభలో గ్రామ ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన తాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు, విద్యా మరియు వైద్య సేవల మెరుగుదల తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను నమోదు చేసి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఆధారంగా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మోతే యాదగిరి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. గ్రామ ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి ఈ కార్యక్రమం మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా కృషి చేయాలని అధికారులకు,



ప్రజాప్రతినిధులకు సూచించారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓ త్రివేద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వాటి అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగీత గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతిని తెలియజేస్తూ, ప్రజల సూచనలను స్వీకరించి అభివృద్ధి ప్రణాళికలో పొందుపరుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్ఎంలు, పోలీసు శాఖ అధికారులు, విద్యుత్ శాఖ లైన్‌మెన్ రమేష్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, యువతులు, రైతులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామసభలో విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం, మహిళా సంక్షేమం, పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ సేవలు, తాగునీటి సౌకర్యాలు, పేదల సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను వివరించి ప్రజల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభించే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గూడెం గ్రామంలో వడ్ల కొనుగోళ్లు పూర్తి

- రైతులకు ఊరట కలిగించిన కొనుగోలు ప్రక్రియ ముగింపు

హైదరాబాద్ పెన్ పవర్:
కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్ల కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. గ్రామ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించి కొనుగోళ్లను ముగించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగడంతో రైతులు






హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మోతే యాదగిరి గౌడ్ మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం వల్ల రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేసి ప్రక్రియను విజయవంతంగా ముగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ గంగారెడ్డి, గ్రామ ప్రజలు, రైతులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యాన్ని విక్రయించిన రైతులు ప్రభుత్వానికి, కొనుగోలు కేంద్ర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో వడ్ల కొనుగోళ్లు పూర్తికావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# క్యాసంపల్లి తండా సాదాబైనామా భూములకు త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి

- 40 ఏళ్లుగా సాగులో ఉన్న భూముల పత్రాల
- పరిశీలనకు గ్రామానికి వచ్చిన ఎమ్మార్వో హేమబిందు
- ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని
- భూములపై పూర్తి హక్కులు కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

హైదరాబాద్ పెన్ పవర్:
కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి తండా గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా గ్రామ ప్రజలు సాగు చేసుకుంటూ వస్తున్న భూములకు సంబంధించిన సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం గురువారం నిర్వహించబడింది. 2020 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా గ్రామ ప్రజలు తమ భూములకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇప్పటివరకు పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కామారెడ్డి ఎమ్మార్వో హేమబిందు క్యాసంపల్లి తండా గ్రామాన్ని సందర్శించి, గ్రామస్తులు సమర్పించిన ధృవపత్రాలు, సాగు ఆధారాలు, పాత రికార్డులు మరియు ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను పరిశీలిస్తూ భూముల యాజమాన్యానికి సంబంధించిన ఆధారాలను నమోదు చేశారు. గ్రామ ప్రజలు కూడా తమ వద్ద ఉన్న పాత పత్రాలను అధికారులకు అందజేసి భూములపై తమ హక్కులను వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తమ కుటుంబాలు 40 సంవత్సరాలకు పైగా ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. తరతరాలుగా వ్యవసాయం చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయి హక్కు పత్రాలు లేకపోవడం వల్ల బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల అమలు, భూ సంబంధిత ఇతర వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. 2020లో సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రక్రియ ఆలస్యమవుతుండటంతో రైతులు నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామంలోని అనేక కుటుంబాలు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు సంబంధించిన సమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయాలని కోరారు. భూములపై పూర్తి హక్కులు కల్పిస్తే రైతులకు భరోసా కలుగుతుందని అన్నారు. ఎమ్మార్వో హేమబిందు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు సమర్పించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇప్పటికే పత్రాల పరిశీలన పూర్తయినందున ఇక ఆలస్యం చేయకుండా సాదాబైనామా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తే తమ కుటుంబాలకు భద్రతతో పాటు వ్యవసాయాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హేమబిందు, గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్, జీపీఓ బలరాం గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాణి, గ్రామ పాలకవర్గ సభ్యులు, రైతులు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. క్యాసంపల్లి తండాలో నిర్వహించిన ఈ పరిశీలన కార్యక్రమం సాదాబైనామా భూముల సమస్య పరిష్కారానికి కీలక ముందడుగుగా నిలుస్తుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.



# బిఆర్ఎస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

హైదరాబాద్ పెన్ పవర్:
కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కామారెడ్డి,పంచముఖి హనుమాన్ ఆలయ,మాజీ చైర్మన్ గైని శ్రీనివాస్ గౌడ్ బి ఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,మరియు కామారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ లో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కవిత, మాట్లాడుతు.. టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగను ప్రతి గ్రామాన, మండలాల, జిల్లాలో జెండా గద్దెలు నిర్మించి జెండావిష్కరణ చేయాలని. కవిత గైని శ్రీనివాస్ గౌడ్ కు ఆదేశించారు. టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కామారెడ్డి నియోజకవర్గంలో కృషి చేయాలని కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రంగు నవీన చారి, సదాశివనగర్ మండల టిఆర్ఎస్ నాయకులు సాయ గౌడ్, సతీష్, సాయి కుమార్ టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## మానవత్వానికి నిదర్శనం కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు: సీతాలే రమేష్

హైదరాబాద్ పెన్ పవర్:
సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగా ఉందని నిరూపించే ఘటన బాన్సువాడలో చోటుచేసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో తన కుమార్తె వివాహం నిర్వహించలేకపోతున్నానని షేక్ మౌలానా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా. సీతాలే రమేష్‌ను కలిసి సహాయం కోరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డా. సీతాలే రమేష్ స్పందిస్తూ, "మతం మనుషులను వేరు చేయదు.. మనసులు కలిపితే అదే మానవత్వం" అని పేర్కొన్నారు. అనంతరం హిందూ సోదరులు డా. సీతాలే రమేష్, పంచారెడ్డి అనిల్, మర్కెల్లి సంతోష్ పటేల్, సూదం నవీన్, సత్యనారాయణ సార్, శ్రావణ్ , శ్రీనివాస్ (హెగ్డోలి) తదితరులు కలిసి ఒక క్వింటాల్ బియ్యం మరియు రూ.2,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా డా. సీతాలే రమేష్ మాట్లాడుతూ,



అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ చిన్న సహాయం ఒక కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా, సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతృత్వం మరియు పరస్పర గౌరవానికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్థానికులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి సహాయం చేయడం నిజమైన భారతీయ సంస్కృతికి ప్రతీక అని కొనియాడారు.

## తెయూలో పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న '»Ek Ped Maa Ke Naam -- Sowing to Growing 2026 పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం వీసీ ఆచార్య యాదగిరిరావు ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అపర్ణ, ప్రోగ్రాం ఆఫీసర్లు స్వామి, శ్రీనివాస్ ఉన్నారు.

## తల్లి ముగ్గురు పిల్లలు మిస్సింగ్ కేసు నమోదు

హైదరాబాద్ పెన్ పవర్:
యాడారం భాను ప్రకాష్ అను అతను కామారెడ్డి పోలీస్ స్టేషన్ కు గురువారం తన భార్య ముగ్గురు పిల్లలు మిస్ అయ్యారని ఫిర్యాదు చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే బాధితుడి తన భార్య లయ అలియాస్ శ్యామల (31) కూతురు బిందు (17)మరొక కూతురు దివీజా (08) కొడుకు శివ (13 ) బుధవారం కామారెడ్డి పట్టణంలో షాపింగ్ నిమిత్తం వచ్చి మధ్యాహ్నం సమయంలో 12 గంటలకు తన బావమరిది వాళ్ళ ఇంటికి వెళ్లి లంచ్ చేసిన తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి వెళుతున్నామని చెప్పి ఆటో లో వెళ్లడం జరిగినది. రాత్రి 8 గంటల వరకు బస్సు కు ఇంటికి వస్తా అని చెప్పినది కానీ ఇంటికి వెళ్లలేదు తన భార్య మరియు ముగ్గురు పిల్లలు మిస్ అయ్యారు. అని దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము. అని పోలీసు సిబ్బంది తెలిపారు.



## డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలలో చేరండి

హైదరాబాద్ పెన్ పవర్:
డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నదని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయన సూచించారు. బి.ఏ., బి.కాం., బి.ఎస్సి. కోర్సులలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఊూూ (Degree Online Services Telangana) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 16 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల, రిజల్ట్స్ కోసం డైరెక్ట్ లింక్స్

**హైదరాబాద్, జూన్ 8 పెన్ పవర్:** తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చేశాయి. గురువారం (జూన్ 11న) ఉదయం ఇంటర్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ రిజల్ట్స్ విడుదలయ్యాయి. ఫస్టియర్, సెకండియర్ సంబంధించిన సాధారణ (జనరల్), ఒకేషనల్ కోర్సుల ఫలితాలను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. ఇటీవల జరిగిన సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.80 లక్షల మంది ఇంటర్ విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ బోర్డు ఈ ఫలితాలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే విడుదల చేసింది. పరీక్షలు రాసిన విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి ఫలితాలు చెక్ చేసుకోవాలని సూచించారు. తమ హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి విద్యార్థులు ఫలితాలు చెక్ చేసుకోవాలి. మార్కుల షీట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలంగాణ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 13వ తేదీన ప్రారంభమై 28న ముగిశాయి. అయితే కాలేజీలలో ప్రవేశాలు, విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని రిజల్ట్స్ త్వరగా విడుదల చేశారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## కారు, లారీ ఢీ.. ఒకరికి గాయాలు

**వికారాబాద్ పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది.వేగంగా వెళ్తున్న కారు లారీ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు ముందు భాగంతో పాటు డివైడర్ గ్రిల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముందు వెళ్తున్న బైకును తప్పించబోయిన కారు అదుపు తప్పి పక్కనే వస్తున్న లారీని బలంగా ఢీకొట్టి, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్పైకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. కారు యజమాని-టీచర్ శాంత కుమార్ స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డాడు.ప్రమాదం జరగగానే లారీ డ్రైవర్ లారీ వదిలి పరారయ్యాడు.

## బౌరంపేటలో చోరీలు

**కుత్బుల్లాపూర్ పెన్ పవర్:**
దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి,బౌరంపేట లో రాత్రి తాళాలు వేసిన ఇండ్లలో దొంగ తనానికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి.చిరుద్యోగి రవి అనే వ్యక్తి ఉంటున్న ఇంటి తాళం పగలగొట్టి చోరీ కి దుండగుడు పాల్పడ్డాడు. 35000, రూపాయలు 3.5 తులాలు బంగారం అపహరణకు గురయ్యాయి. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. మరో ఇంట్లో 1 లక్ష 30 వేల నగదు చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితులు.ఉదయం 3 గంటల ప్రాంతంలో దొంగ తనానికి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో, దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## జీహెచ్ఎంసిలో డీజిల్ దొంగలు

**హైదరాబాద్: పెన్ పవర్:** జీహెచ్ఎంసీలో దొంగలు పడ్డారు. ఇంధనం పక్కదారి పట్టిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. కానీ, ఆ దొంగలు చిక్కరూ.. దొరకరు. ఎందుకంటే వారందరూ ఇంటి దొంగలే.. తోడు దొంగలే. నగరంలో చెత్త తరలింపు వాహనాలకు జీహెచ్ఎంసీ ఉచితంగా డీజిల్ సమకూరుస్తుంది. కొంత మంది సిబ్బంది ఇక్కడే చేతివాటం చూపుతున్నారు. ఈ డీజిల్ను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ ఆరోపణలు చాలా కాలంగానే ఉన్నా.. చర్యలు మాత్రం లేవని కార్మికులు ఆరోపిస్తున్నారు
చెత్త తరలింపు వాహనాల డీజిల్ ట్యాంక్ లోంచి గుట్టుగా డీజిల్ తీస్తున్న సిబ్బంది.. బహిరంగ మార్కెట్లో దాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. చాదర్ ఘాట్ జైల్ గార్డెన్ ల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై యూనియన్ నేతలు మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ (+ఎవీజ) చెత్త తరలింపు వాహనాలు, మరియు అధికారుల కార్ల డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని చాదర్ ఘాట్ జైల్ గార్డెన్ డ్రైవర్స్.కార్మిక యూనియన్ నేతలు డిమాండ్ చేశారు వాహనాల రవాణా మరియు ఇంధన కేటాయింపుల్లో పారదర్శకత లోపించడం వల్ల ఈ అవినీతి జరుగుతోందని వారు విమర్శించారు. వాహనాలకు సమకూరుస్తున్న డీజిల్, దాని వినియోగంపై ఉన్నత స్థాయి ఆడిట్ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగాన్ని రంగంలోకి దింపి సమగ్ర విచారణ జరిపితేనే ప్రజాధనం దుర్వినియోగం అరికట్టబడుతుందని తెలిపారు

## కలెక్టరేట్ ముందు ఏఐవైఎఫ్ ధర్నా

**మేడ్చల్: పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర
మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని అదే విధంగా రాష్ట్రంలోని అన్ని శాఖలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాల ద్వారా యువతకు భరోసా కల్పించాలని అదే విధంగా ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం ఎాఖీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు...

## నాచారంలో బీజేపీ నేతల ప్రత్యేక పూజలు

**మేడ్చల్: పెన్ పవర్:** నరేంద్ర మోదీ భారతదేశంలో అత్యధిక కాలం 4,399 రోజులు నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా చారిత్రక రికార్డు సృష్టించడంతో దేశం మరింత అభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ నాచారం లో బీజేపీ నేతలు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలకు సిర్పూర్ ఖాగజ్ నగర్ ఎమ్మెల్యే
పాల్వాయి హరీష్ ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక పూజలు నిర్వహించి మోదీ దీర్ఘాయుష్ తో జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్, రవి నాయక్ మాట్లాడుతూ మోదీ దేశానికి
నిరంతరం సేవలు అందించాలని మరియు 'వికసిత భారత్' ఆశయం నెరవేరాలని ప్రార్థించారు.ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మోదీ నాయకత్వంలో దేశానికి స్థిరమైన పాలన లభించడం గర్వకారణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ ఒక సరికొత్త మైలురాయిని చేరుకున్నారని వారు కొనియాడారు...

## రెండు లారీలు ఢీ.. డ్రైవర్ సజీవ దహనం

**నిర్మల్: పెన్ పవర్:** నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామం వద్ద నేషనల్ హైవే 44 పై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ టైరు పంచర్ కావడంతో రోడ్డుపైన ఆగింది. ఆగి ఉన్న లారీని హైదరాబాద్ కు జొన్నలలోడు తీసుకుని వెళుతున్న మరో లారి ఢీకొంది. ప్రమాదంలో జొన్నల లోడ్డుతో వెళు న్న లారీలోమంటలు చిలరేగాయి. లారీ డ్రైవర్ ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రానికి చెందిన జవారి సింగ్ సజీవదహనం అయ్యాడు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసారు.లారీలు ఢీకొన్న ప్రమాదాన్ని చూస్తూ పక్కనుంచి అదిలాబాద్ వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న లారీని ఇన్నోవా ఢీకొంది. కారు, డ్రైవర్ కాళ్లు విరిగాయి. భాధితుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. .

## రోడ్డు విస్తారణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం

**హుస్నాబాద్: పెన్ పవర్:** హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించి వాటి స్థానం లో నిర్మిస్తున్న విద్యుత్ టవర్స్ పనులను పరిశీలించి విద్యుత్ తీగల స్తంభాల తొలగింపు పై సిబ్బంది తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత రహదారి విస్తరణ లో భాగంగా కొండాపూర్ గ్రామ శివారుల్లో నిర్మితమవుతున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు విస్తరణ లో పెండింగ్ లో ఉన్న కల్వర్టులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్యాకేజీ 1,2 కింద 163.20 కోట్లు మంజూరు చేసింది .కొత్తపల్లి నుండి సందరగిరి 10 కిమీ రోడ్డు విస్తరణకు ప్యాకేజీ -1 కింద 86 కోట్లు మంజూరు చేసింది. సుదరగిరి నుండి హుస్నాబాద్ కి ప్యాకేజీ 2 కింద 77.20 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

# రైతన్నలారా ఇకనైనా మారండి రసాయన ఎరువులను వాడకండి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:** జమ్మికుంట కేవీకేలో ప్రక్రుతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి.
రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రక్రుతి వ్యవసాయంపై ద్రుష్టి సారించాలని కోరారు. ప్రక్రుతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు మద్దతు ధర రాదనే బాధ అక్కర్లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశముందన్నారు. కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవు మళ్లించడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తి నేపథ్యంలో ఆయన స్పూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.
భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని క్రుషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రు నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్టు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ను,ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. భూమి పూజ చేశారు. మొక్క నాటారు. ప్రక్రుతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రుతి వ్యవసాయాన్ని పెంపొందించేందరుకు క్రుషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న క్రుషిపై ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్ ప్రసంగించారు. ముఖ్యాంశాలు:
గోమాత, భూమాత, భరతమాత నినాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రాబోయే రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట క్రుషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను,సిబ్బందిని మనస్పూర్తిగా అభినందిస్తున్నా. ఈ దేశంలో కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లిస్తానని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు స్పూర్తితో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే రెండేళ్లలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయం వైపు మళ్లిస్తా. జమ్మికుంట కేవీకే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.
రసాయన ఎరువులతో వ్యవసాయం చేస్తూ అధిక పంట పండిస్తూ,రోగాలు కొని తెచ్చుకుంటున్నాం. ఉజ్బెకిస్తాన్ వంటి దేశం రసాయనాలు వాడటంవల్ల సర్వనాశనమైంది. దేశానికి అన్నపూర్ణగా విలసిల్లిన పంజాబ్ లో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ కావడంవల్ల క్యాన్సర్ రోగులు ఎక్కువయ్యారు. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక ట్రైన్ వెళుతున్న ద్రుశ్యాలు అత్యంత బాధాకరం.

# ఈ నెలాఖరులో కరీంనగర్ నూతన కలెక్టరేట్: సీఎం చేతుల మీదుగా ప్రారంభం



**హైదరాబాద్ పెన్ పవర్:**
కరీంనగర్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.
గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్మితమైన నూతన కలెక్టరేట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా అభివృద్ధికి పరిపాలనా కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు.
గతంలో ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణ పనులు వివిధ కారణాలతో పూర్తికాక నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రత్యేక చొరవ తీసుకుని మిగిలిన పనులను వేగవంతం చేసి పూర్తిచేయించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సహకారంతో అన్ని ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వసతులు, పౌరులకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కూడిన కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని వెల్లడించారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.
సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. పర్యావరణ హిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వ్యవస్థతో ఈ కలెక్టరేట్ రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్‌ను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.
జిల్లాను పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.
శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటు ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని చెప్పారు. గతంలో నిలిచిపోయిన విద్యా అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త ఊపునిస్తూ మరిన్ని కోర్సులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.
ఆరోగ్య రంగంలో కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.
మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, డంప్‌యార్డు తరలింపునకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఆర్డీవో షర్మిల, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దడ పుట్టించిన తొలి వర్షం..

**హైదరాబాద్, జూన్ 11 పెన్ పవర్:**
హైదరాబాద్ నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన భాగ్యనగరానికి తొలకరి పలకరింపు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని భావించినప్పటికీ.. ఈ వాన మాత్రం సున్నితంగా, ఆనందంగా డాన్సులు వేసేలా లేదు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఉగ్రరూపం దాల్చి నగరవాసులను ఒక్కసారిగా దడదడలాడించింది. మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా అంధకారమయమై, ఒక భారీ ఉరుముల, మెరుపుల వర్షం నగరంలోకి ప్రవేశించడంతో వాతావరణం క్షణాల్లో మారిపోయింది.వాతావరణ పరిశీలకుల హెచ్చరికల ప్రకారం.. అమీన్‌పూర్, పటాన్‌చెరు, బాచుపల్లి మీదుగా అంచెలంచెలుగా విస్తరించిన ఈ భారీ మేఘాల గుంపు, గంటల వ్యవధిలోనే హైదరాబాద్ మహా నగరాన్ని పూర్తిగా చుట్టేసింది. పశ్చిమ, మధ్య హైదరాబాద్ పరిధిలోని ఐటీ కారిడార్‌తో పాటు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉరుముల గర్జనలతో కూడిన కుండపోత వాన కురిసింది. కేవలం గంట వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 40 మి.మీ నుండి 50 మి.మీ వరకు వర్షపాతం నమోదు కావడంతో.. నగర రహదారులు చూస్తుండగానే చెరువులను తలపించాయి. కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు తిరుగు ప్రయాణమైన వేలాది మంది ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఈ ఆకస్మిక వాన దెబ్బకు తడిసి ముద్దయ్యారు. ఈ భారీ వర్షం కారణంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, బంజారాహిల్స్, పంజాగుట్ట వంటి రద్దీ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీరు, లోతట్టు ప్రాంతాల్లో జలమయమైన రహదారుల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వానకు తోడు నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడటం,



విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం సమస్య తీవ్రతను మరింత పెంచిందినగరంలో తలెత్తిన ఈ ట్రాఫిక్ గందరగోళాన్ని చక్కదిద్దడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. వాహనదారులకు సోషల్ మీడియా ద్వారా నిరంతరం అలర్ట్‌లు జారీ చేశారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ నగరవాసులకు కొన్ని కీలక సూచనలు చేసింది. వర్షం పడుతున్న సమయంలో రోడ్లపై ప్రయాణించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. రోడ్లు జారే ప్రమాదం ఉన్నందున వాహనాల వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలి. ముఖ్యంగా బైక్ నడిపేవారు ఓవర్ టేక్‌లు చేయవద్దని, భారీ ఈదురుగాలులు వీస్తున్నందున చెట్ల కింద, పాత గోడల పక్కన వాహనాలను ఆపకూడదు అని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలపడనున్నందున ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

# యాక్టివ్ పాలిటిక్స్ కు మల్లారెడ్డి దూరం..?



**రంగారెడ్డి, జూన్ 11, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయా ల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి (బి ఆర్ ఎస్) ఎన్నికల్లో పో టీ చేయవద్దని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బి ఆర్ ఎస్ అ ధిష్టానం టికెట్ ఇస్తే తన పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డిని బరిలోకి దింపాలని భావిస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి బిజెపిలో చేరుతారని ఇటీవల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.ఎంపీ తో పాటు 5 ఎమ్మెల్యే టికెట్లు ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని బిజెపి అధిష్టానాన్ని అడుగుతున్నారని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో అనుచరులు కొందరు నేరుగా మల్లారెడ్డిని ఈ విషయమై అడిగారు. తాను పోటీ చేయబోనని, టిఆర్ఎస్ టికెట్ ఇస్తే మహేందర్ రెడ్డి పోటీ చేస్తారని చెప్పారు.అంతేగాక చిన్న కుమారుడు భ ద్రారెడ్డి, కోడలు ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతారని సూటిగా చెప్పకుండా చేరుతారేమోనని అన్నారు. బిజెపిలో చేరబోనని, బి ఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పారు. మల్లారెడ్డి కోడలు ప్రీతి రె డ్డికి రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఆమె బిజెపిలో చేరుతారని పార్లమెంటుకు పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో మూడు చోట్ల ఇటీవల బి ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు, సర్ పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడ్చల్, ఘట్కేసర్ తో పాటు మరోచోట సమావేశాలు జరిగాయి. వీటికి సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానికంగా ఉన్నప్ప టికీ సమావేశాలకు హాజరు కాలేదు. పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జిగా హాజరయ్యారు. స్థానికంగా ఉండి సమావేశాలకు హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. బిజెపిలోకి వెళ్తున్నందున సమావేశాలకు హాజరు కాలేదని ప్రచారం జరిగింది. మల్లారెడ్డి తీరుపై బీఆర్ఎస్ అధిష్టానం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. టిఆర్ఎస్ లో ఉంటూనే కాంగ్రెస్ బిజెపి నేతలను కలిశారు. వార్షికోత్సవానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధాని మోడీని వేసి ఆహ్వానించారు.పార్టీకి సమాచారం లేకుండా కలవడంపై అధిష్టా నం గుర్రుగా ఉంది. బి ఆర్ ఎస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం లో ఈ విషయమై కెసిఆర్ మల్లారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీకి సమాచారం ఇవ్వకుండా సీఎంను కలవడంతో బిఆర్ఎస్కు చెందిన ముఖ్య నాయకులు వివాహ వార్షికోత్సవానికి గైరహాజరయ్యారు. కాంగ్రెస్కు చెందిన డి ప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ విషయమే అప్పట్లో పెద్ద చర్చ జరిగింది. మల్లారెడ్డి నిర్ణయం వ్యూహాత్మకమా లేక నిజంగానే పోటీ చేయరా అనేది చర్చనీ అంశమైంది. వాస్తవానికి మల్లారెడ్డి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఇంకో టర్మ్ పోటీ చేయగలరు. ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో అనుచరులకు అర్థం కా వడం లేదు. ఆరు నెలల క్రితం తాను పోటీ చేయను అని అ న్నారు. ఆ తర్వాత మళ్లీ నేను అలా అనలేదు అంటూ మాట మార్చారు. ఇప్పుడు కూడా మాట మార్చేస్తారా? నిజంగానే పోటీకి దూరంగా ఉంటారో వేచి చూడాల్సిందే!

# నామినేటెడ్ రెన్యువల్స్ కష్టమే...

**వరంగల్, జూన్ 11, పెన్ పవర్:**
ఒక్కొక్కటి రెన్యువల్ అవుతున్నాయి..! మరి మా సంగతి ఏంటి..? వాళ్ళకే అవుతాయా మాక్కూడా రెన్యువల్ చేయండి ప్లీజ్..అంటూ నేతల ముందు అప్పీల్ చేస్తున్నారు. ఇంతకి అయ్యేది ఎందరికి...హ్యాండ్ ఇచ్చేది ఎవరికి..!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 37 మంది నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. 2023 ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన వాళ్లు కొందరు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఇంకొందరు ఆ లిస్ట్‌లో ఉన్నారు. వాళ్ళ పదవీకాలం జులైతో ముగుస్తుంది. అదే సమయంలో కొత్తగా పదవుల కోసం చాలా మంది కాంగ్రెస్ నాయకులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జూన్ వచ్చేసింది...ఇక జులై వచ్చేస్తుంది...అంటూ రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. సరిగ్గా ఇక్కడే తేడా కొడుతోందట. పదవుల కోసం కొత్తగా ఎదురుచూస్తున్న వాళ్ళు ఎంత ఆశతో ఉన్నారో... ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఉన్న నాయకులు కూడా అంతే ఆశతో రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు 37 మంది కార్పొరేషన్ చైర్మన్స్ పని తీరుపై సీఎం రేవంత్ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ చాలా మంది పని తీరు మెరుగు పరుచుకోలేదన్న అభిప్రాయం ఉంది. పైగా వాళ్ళు ఎవరూ పార్టీ కోసం సరిగా సమయం ఇవ్వడం లేదన్న నివేదికలు సైతం సీఎం దగ్గర ఉన్నాయట. రెన్యువల్ అయ్యే వాళ్ళ సంఖ్య చాలా తక్కువ అనే భావన కూడా ఉంది. ఐతే ఇటీవల టీశాట్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పదవుల్ని రెన్యువల్ చేసింది ప్రభుత్వం. దీంతో... మిగతా వాళ్ళలో కొందరు ...మా పదవులు మాత్రం ఎందుకు రెన్యువల్ కావన్న ధీమాతో ఉన్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే... టెన్షన్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఏ లెక్కన చూసుకున్నా... ఇప్పుడున్న 37మందిలో మెజార్టీ నాయకులకైతే రెన్యువల్ ఉండకపోవచ్చనే తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని టీజీఐఐసీ చైర్మన్‌గా కొనసాగించే అవకాశం ఉంది. అలాగే....స్పోర్ట్స్ అథారిటీ,ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ చైర్మన్ లాంటి కొన్ని పదవులకు మాత్రం రెన్యువల్స్ ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం పదవీకాలం ముగుస్తున్న వాళ్ళలో 16 మందికి ఇంటెలిజెన్స్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయని, సదరు ఛైర్మన్స్ రెజుమేస్‌ను తిరిగి అడిగినట్టు ప్రచారం జరుగుతోంది. రేవంత్ సీఎం అయినప్పటి నుండి.. పదవులు ఇచ్చే ప్రతిఒక్కరి విషయంలో పోలీసు విచారణ చేయిస్తున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు కూడా అదే పంథా ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. కొందరు కార్పొరేషన్ చైర్మన్ ల మీద ఆరోపణలు వచ్చిన క్రమంలో ఫ్రెష్ గా నివేదిక కోరినట్టు తెలుస్తోంది. ఏదేమైనా రెన్యువల్ కి సమయం దగ్గర పడుతుండటంతో చాలా మందిలో ఐతే టెన్షన్ మొదలైందని అంటున్నారు. మళ్ళీ ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ.. నేతల వద్దకు క్యూ కడుతున్నారు. వీరికి తోడు.. కొత్తగా పదవులు ఆశిస్తున్న వారు కూడా ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళు ఉన్నారు.

## భీమా సొమ్ము కోసం ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**కామారెడ్డి**
భీమా సొమ్ము కోసం ఓ భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మర్కెల్ గ్రామానికి చెందిన కంచర్ల రాజయ్య, రేణుక దంపతులు. రేణుక, గంగాశేఖర్ అనే వ్యక్తితో గత నాలుగేళ్లుగా వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్తను హత్య చేస్తే అడ్డు తొలగిపోతుందని, అలాగే భీమా డబ్బులు కూడా వస్తాయని ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. పథకంలో భాగంగా మే 21వ తేదీన రాజయ్యకు మద్యం తాగించి, తిర్మన్ పల్లి శివారులో తలపై రాడ్తో కొట్టి హత్య చేసి రోడ్డు ప్రమాదంగా గంగాశేఖర్ చిత్రీకరించాడు. రాజయ్య పొలం పనులకు వెళ్తుండగా గుర్తు తెలియని జంతువు అడ్డు రావడంతో, వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందాడని భార్య రేణుక పోలీసులకు తెలిపింది. రేణుక తీరుపై అనుమానం వచ్చి విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. దీంతో ప్రియుడు గంగాశేఖర్, రేణుకను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

**హైదరాబాద్:** రోడ్డుప్రమాదంలో నడిరోడ్డుపై తీవ్రగాయాలతో మహిళ మృతి చెందింది. అయితే మృతదేహం దాదాపు 35 నిమిషాల పాటు నడిరోడ్డు పైనే ఉండిపోయింది. శేరిలింగంపల్లి పరిధిలోని మదినగూడలో ఘటన జరిగింది. 35 నిమిషాల పాటు మృతదేహాన్ని రోడ్డుపై నుండి తొలగించలేదని అధికారుల తీరుపై ప్రజల అసహనం వ్యక్తం చేసారు .ఒకవేళ తీవ్ర గాయాలతో రోడ్డుపై ఉన్నా అధికారులు ఇలానే స్పందిస్తారా అంటూ విమర్శలు గుప్పించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం టిప్పర్ డ్రైవర్ మృతి

**హన్మకొండ:** రహదారి పక్కన ఉన్న చెట్లకు నీరు పోస్తున్న లారిని టిప్పర్ అతివేగంగా ఢీకొట్టింది. హన్మకొండ జిల్లా పసరగొండ క్రాస్ సమీపంలో హైదరాబాద్--భూపాలపట్నం హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో టిప్పర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## మజిల్స్ పెంచే ఇంజక్షన్ స్వాధీనం

**వరంగల్:** వరంగల్ చారబౌలిలో కండలు పెంచే ఇంజక్షన్లు విక్రయిస్తున్న మహ్మద్ అబ్దుల్ సోహెబ్ ను డ్రగ్ కంట్రోల్ అధికారులు అదుపులోకి తీసుకున్ఆరు. నిందతుడినుంచి 30 ఇంజెక్షన్ల (రూ.15,827)ను స్వాధీనం చేసుకున్నారు. ఆన్లైన్లో తెప్పించి యువకులకు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు.

## తండ్రి ప్రాణాలు తీసిన నాటుకోడి కూర

**జనగామ:** నాటుకోడి విషయంలో తలెత్తిన గొడవ లో వ్యక్తి మృతి చెందాడు. కోడికూర ఘర్షణలో తండ్రిపై కొడుకు రోకలిబండతో దాడికి దిగాడు. తండ్రి రమేష్ తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి గ్రామంలో ఘటన జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నాటుకోడి తెచ్చి భార్యను కూర వండమని రైతు జంగిలి రమేష్ చెప్పాడు. రాత్రి అవుతుంది వద్దని భర్తకు భార్య నచ్చచెప్పింది. దాంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తన తల్లిని ఎందుకు తిడుతున్నామని తండ్రిని కుమారుడు గణేష్ ప్రశ్నించాడు. నన్నే ప్రశ్నిస్తావా.. అంటూ కొడుకు గణేష్ ను చంపపై తండ్రి రమేష్ కొట్టాడు. క్షణికావేశానికి గురైన గణేష్ పక్కనే ఉన్న రోకలిబండతో తన తండ్రిపై తలపై దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావమై కింద పడిపోయిన రమేష్ . ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ఆవిష్కరణ పాల్గోన్న కవిత

**హైదరాబాద్:**
బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అవిష్కరించారు.కవిత మాట్లాడుతూ జులై 2న ఉప్పల్ భగాయత్ భూములు స్వాధీనం చేసుకుంటాం. ఉద్యమకారుల భూపోరాటానికి అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలి. జులై 2న ఉప్పల్ భగాయత్ లో భూపోరాటం చేసి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇచ్చే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి ఇస్తామన్న భూమి ఇవ్వాల్సిందే. మరో మారు కొంతమంది వ్యక్తులు, శక్తులు తెలంగాణవాదం మీద దాడి చేస్తూ తెలంగాణ స్ఫూర్తిని దెబ్బ తీసే కుట్ర చేస్తున్నారు. అందుకే వాళ్ల కుట్రలను తిప్పికొట్టేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం మనందరి చారిత్రక కర్తవ్యం. ఉద్యమకారులకు మంచి జరగాలని భావించే వాళ్లంతా పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నా. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొనాలి. మీ భవిష్యత్ కోసం ఉద్యమకారులు వాళ్ల జీవితాలనే త్యాగం చేశారు. కనుక వారికి మంచి చేసే కార్యక్రమంలో మనమంతా పాల్గొనాలని అన్నారు.

## మొయినాబాద్ జంట హత్యల కేసులో.. నయవంచకురాలు మృతి

తమ అవసరాల కోసం ఇద్దరి దగ్గరి బంధువుల వద్ద అప్పు తీసుకొని తిరిగి అప్పు తిరిగి ఇవ్వమని అడిగినందుకు నమ్మించి నయవంచనకు పాల్పడి ఇద్దరి మహిళలను దారుణ హత్య చేసిన ప్రధాన నిందితురాలు కరీమా బీ పోలీస్ కస్టడీలోయాసిడ్ తాగి 24 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీసులపై ఇప్పటికే వేటు వేశారు. ఇదిలా ఉండగా ఆత్మహత్యకు పాల్పడిన కరిమాబి చావు బతుకుల్లో ఉండగా నిమ్స్ ఆస్పత్రిలో కూకట్ పల్లి మెట్రోపాలిటన్ జడ్జి ముందు మరణ వాంగ్మూలం రికార్డు చేయడం జరిగింది. ఈ మరణవాంగ్మూలంలో కరిమాబి తాను తప్పు చేశానని అందుకే ఇక బ్రతక కూడదని, దీంట్లో ఎవరి ఒత్తిడి లేదని జడ్జి ముందు పేర్కొన్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో చోటుచేసుకుంది. తీవ్ర కలకలం రేపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసిం పూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం(60) అంగన్వాడి ఆయాగా పని చేస్తూ ఈనెల 5 వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. ఎక్కడ ఆచూకీ లభించక పోవడంతో ఈనెల 10న బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అదేవిధంగా తాండూర్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బి (58) ఈనెల 9వ తేదీన అదృశ్యమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు మహబూబ్ బీ తప్పిపోయిందని ఈనెల 10న యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్ పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలని లో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్ కరిమా బేగమ్ ల పై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన తాండూరు పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్య భర్తలు రెహమాన్ (ఆటోడ్రైవర్) , కరీమా బేగం లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొయినాబాద్ ఫామ్ హౌస్ లో పనిచేస్తున్న తన బావమరిది తో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ వేర్వేరు మహిళలను నమ్మించి పిలిపించి, మొయినాబాద్, చేవెళ్ల లోని వేర్వేరు ఫార్మ్‌హౌస్‌లలో దారుణంగా హత్య హత్య చేసి అక్కడే పూడ్చిపెట్టారు. ఈ జంట హత్యల కేసు రంగారెడ్డి జిల్లా పరిధిలో తీవ్ర కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలకు (60 ఏళ్ల పైబడినవారు) కొంతకాలంగా కొందరితో ఫైనాన్స్ (డబ్బుల) వ్యవహారంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బాధితులకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికిన నిందితులు, వారిని తాండూరు నుంచి ఇక్కడికి రప్పించారు.బాధితులు ఇక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు వారిని విడివిడిగా తరలించారు. ఒక మహిళను మోయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఫార్మ్‌హౌస్‌లో, మరో మహిళను చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంకొక ఫార్మ్‌హౌస్‌లో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాలను ఆయా ఫార్మ్‌హౌస్‌లలోనే గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారు. మోయినాబాద్ పరిధిలోని ఫార్మ్‌హౌస్ నుండి ఇప్పటికే ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల పరిధిలోని ఫార్మ్‌హౌస్‌లో పూడ్చిపెట్టిన మరో వృద్ధురాలి మృతదేహాన్ని వెలికితీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్లూస్ టీమ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసును వేగవంతం చేశారు. పోలీస్ అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నారు.

## కాంగ్రెస్ లో విలీనం దిశగా తృణమూల్

**న్యూఢిల్లీ, జూన్ 11 పెన్ పవర్:** బీజేపీ నుండి పెరుగుతున్న రాజకీయ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి , ప్రతిపక్షాలను బలోపేతం చేయడానికి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని సోనియా గాంధీ ప్రతిపాదించారు. పార్టీలో అంతర్గత విభేదాలు, ప్రముఖ నాయకుల నిష్క్రమణలు వంటి సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రతిపాదనపై వెంటనే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా, ఆలోచించుకోవడానికి మమతా బెనర్జీ కొంత సమయం కోరినట్లు సమాచారం.ఈ విలీన ప్రక్రియ కోసం కాంగ్రెస్ ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, మమతా బెనర్జీకి కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలి పదవిని, అలాగే టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీలో ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనల గురించి ఇరు పార్టీల నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు.రాజకీయ ఉత్కంఠను రేపుతున్న ఈ పరిణామాల మధ్య, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ చర్చలు చాలా ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని అభిషేక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ముగిసిన ఎన్నికల అనంతర పరిస్థితులపై, ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం

పెరుగుతున్న అసమ్మతి నేతలు

తృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం ముదిరిపోయింది. ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ఇండియా కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లీ వెళ్లగానే.. కలకత్తాలో తిరుగుబాటు బావుటా ఎగిరింది. ఏకంగా 20 మంది ఎంపీలు, తాము ఎన్డీయేలో చేరేందుకు అనుమతి కావాలంటూ స్పీకర్ ఓం బిర్లాకి లేఖ రాయడం కలకలం రేగింది.అయితే.. తాజాగా మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. యూసుఫ్ పఠాన్, సయోని ఘోష్, శత్రుఘ్న సిన్హా వంటి ప్రముఖులతో సహా దాదాపు 19 మంది ఎంపీలు తిరుగుబాటుదారుల జాబితాపై సంతకాలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనితో పార్టీ నిలువునా చీలిపోయే దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ దీదీకి సవాల్ గా నిలుస్తున్నాయి. బసిర్‌హత్ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాం మరణంతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, ప్రస్తుతం లోక్‌సభలో టీఎంసీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. అయితే, తాజా తిరుగుబాటు కారణంగా సభలో మమతా బెనర్జీకి ఉన్న వాస్తవ మద్దతు బలం కేవలం 19 మంది ఎంపీలకు తగ్గిపోయింది.తక్షణమే రాజీనామా చేయకూడదని లేదా అధికారికంగా దీజీలో చేరకూడదని అసమ్మతి ఎంపీలు నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాల సమాచారం. దానికి బదులుగా, వారు ఎన్డీఏకి మద్దతునిస్తూ ఒక ప్రత్యేక వర్గంగా కొనసాగాలని యోచిస్తున్నారు; ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు భావిస్తున్న కాకోలి ఘోష్ దస్తీదార్, ఎన్డీయే కు మద్దతు ప్రకటిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తామని చెప్పారు. కనీసం 20 మంది టీఎంసీ (ఎవీజ) ఎంపీలు స్పీకర్‌కు అధికారిక లేఖ సమర్పించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు.లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్‌గా దస్తిదార్ కొనసాగుతున్నారని స్పీకర్ ముందు వాదించే అవకాశం ఉందని అసమ్మతి వర్గం భావిస్తున్నట్లు సమాచారం; పార్లమెంటులో తలెత్తే అవకాశం ఉన్న న్యాయపరమైన మరియు విధానపరమైన పోరాటంలో ఈ వాదన కీలక అంశంగా మారవచ్చు.

## గంజాయి క్వీన్ మళ్లీ తప్పించుకుంది...

**హైదరాబాద్, జూన్ 11 పెన్ పవర్:** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, అమ్మకాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈగల్ ఫోర్స్ ఏర్పాటైనప్పటి నుంచి ఎన్నో డ్రగ్స్ ముఠాలు, గంజాయి ముఠాల ఆట కట్టించింది. ఈ క్రమంలోనే నీతూ బాయి అనే లేడీ డాన్, గంజాయి క్వీన్ మాత్రం ఎప్పటికప్పుడు పోలీసులకు సవాల్ విసురుతూనే ఉంది. గతంలో కొన్నిసార్లు పోలీసుల నుంచి తప్పించుకు పారిపోయిన నీతూబాయి.. తాజాగా మరోసారి ఈగల్ ఫోర్స్ పంజా నుంచి తప్పించుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని పక్కా సమాచారంతో దాడులు చేసిన ఈగల్ ఫోర్స్‌కు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు చిక్కగా.. నీతూబాయి పరారైనట్లు పేర్కొన్నారు.హైదరాబాద్ కోర్ ఐటీ ప్రాంతమైన నానక్‌రాంగూడలో గంజాయి విక్రయాలు, వినియోగాలపై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. డ్రగ్ డాన్ నీతూబాయిని పట్టుకోవడమే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆమె తప్పించుకుంది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారం అందుకున్న నీతూబాయి.. అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆమెను పట్టుకోవడం కోసం నానక్‌రాంగూడలో ఈగల్ ఫోర్స్ అణువణువూ గాలింపు చేపట్టింది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే నానక్‌రాంగూడ ప్రాంతంలో నీతూబాయి.. భారీ ఎత్తున గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నట్లు ఈ తనిఖీల్లో వెల్లడైంది.గంజాయి కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో ఐటీ ఉద్యోగులు.. నానక్‌రాంగూడలోని నీతూబాయి ఇంటి ముందు క్యూ కట్టినట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఒక గంట వ్యవధిలోనే ఏకంగా 50 మంది ఐటీ ఉద్యోగులను పట్టుకున్నట్లు తెలిపింది. ధూల్‌పేట్ నుంచి మకాం మార్చేసి.. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉండే ప్రాంతంలో తన అడ్డాను ఏర్పాటు చేసుకున్న నీతూబాయి.. కిరాణా షాపు ముసుగులో భారీగా గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ దాడుల్లో గుర్తించారు.నిత్యం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువైన గంజాయి విక్రయాలను నీతూబాయి కొనసాగిస్తున్నట్లు వెల్లడైంది. అయితే నీతూబాయిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి.. ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. జైలుకు వెళ్లి బయటికి వచ్చిన నీతూబాయి.. మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. ఈ డ్రగ్ డాన్‌ను పట్టుకునేందుకు ఈగల్ ఫోర్స్ అన్ని చర్యలు చేపట్టింది.ఒకప్పుడు సాధారణ గృహిణిగా ఉన్న నీతూబాయి స్వస్థలం ధూల్‌పేట్. ఆమె కుటుంబం మొత్తం గుడుంబా దందా చేసేది. అయితే ఆబ్కారీ శాఖ రాష్ట్రంలో గుడుంబా తయారీ, విక్రయాలపై పూర్తిగా నిషేధించడంతో వారు గంజాయి దందా మొదలుపెట్టారు. తమ బంధువులు అంతా ధూల్‌పేటను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తుండగా.. నీతూబాయి మాత్రం నానక్‌రాంగూడలోని లోధా బస్తీకి మకాం మార్చింది. 2023లో నీతూబాయి పోలీసులకు పట్టుబడినప్పుడు గంజాయి అమ్మకాలతో రూ.4 కోట్ల స్థిర, చరాస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వాటిని జప్తు చేశారు.

## అడుగుంటున్న భూగర్భ జలాలు.. నగరంలో 3 శాతం మాత్రమే నీరు

**హైదరాబాద్, జూన్ 11 పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో రాష్ట్ర మొత్తం భూగర్భ జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది.ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది.మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో అత్యధిక శాతం భూమి కాంక్రీట్, రోడ్లతో నిండిపోవడం వల్ల వర్షం పడినా నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లోని రాతి భూగర్భ పొరలు, తగ్గిపోతున్న ఖాళీ స్థలాలు సహజ రీఛార్జ్ ప్రక్రియను పూర్తిగా దెబ్బతీశాయని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరవాసులు, ప్రభుత్వం అప్రమత్తమై ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ఆయన హెచ్చరించారు.

## కోలివింగ్ హాస్టల్స్ లో ఏం జరుగుతోంది...

**హైదరాబాద్, జూన్ 11, పెన్ పవర్:**
హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అమిత్ షా కామెంట్స్ వెనుక కారణం అదేనా తెలంగాణ, పంజాబ్‌పై ప్రత్యేక వ్యూహం

**హైదరాబాద్, జూన్ 11, పెన్ పవర్:**
దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ.. ఉత్తర భారత దేశంలో ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల్లో పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ ఒక్కటే కాంగ్రెస్ చేతిలో ఉంది. తాజాగా బెంగాల్‌లోనూ బీజేపీ పాగా వేసింది. ఇక ఇప్పుడు బీజేపీ దక్షిణాదిపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో 2028లో జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ రాజకీయాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఇకపై ఏ రాష్ట్రంలోనైనా ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.తెలంగాణ, పంజాబ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిగా పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే బీజేపీ వ్యూహం రూపొందిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అమిత్‌షా తెలిపారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ రాజకీయ వ్యూహంలో ముఖ్యమైన మలుపును సూచిస్తున్నాయి. గతంలో ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పొత్తుల ద్వారా అడుగుపెట్టిన బీజేపీ, ఇప్పుడు ఒంటరి బలంపై మరింత విశ్వాసం పెంచుకుంది. ఇది పార్టీ తన సొంత ఆధారాలను విస్తరించాలని, స్వతంత్రంగా అధికారం సాధించాలని భావిస్తోందని తెలియజేస్తోంది.తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్, ఏఐఎంఐఎం వంటి ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పొత్తులు తిరస్కరించడం రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై కీలక ప్రకటనఅమిత్ షా మరో ముఖ్యమైన విషయం చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని. ఇది బీజేపీ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం ద్వారా పార్టీ తన విజన్‌ను స్పష్టం చేస్తోంది.ఒంటరి పోటీ ప్రకటన తెలంగాణ రాజకీయ దృక్పథాన్ని మార్చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. పొత్తు ఆశల్లో ఉన్న చిన్న పార్టీలకు ఇది ఎదురుదెబ్బ కావచ్చు. బీజేపీ తన సొంత ఓటు బ్యాంకును విస్తరించి, స్వతంత్ర శక్తిగా ఎదగాలని ప్రయత్నిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలం పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యం స్పష్టమవుతోంది. ఇది దీర్ఘకాలిక వ్యూహం కావచ్చు. పంజాబ్‌తోపాటు తెలంగాణను కూడా ఒంటరి పోటీ మోడల్‌గా తీసుకురావడం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా తన సానుకూలతను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది.అమిత్ షా వ్యాఖ్యలు కేవలం తెలంగాణకు మాత్రమే కాకుండా, బీజేపీ జాతీయ స్థాయి రాజకీయ వ్యూహంలోని ముఖ్యమైన మార్పును తెలియజేస్తున్నాయి. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో అధికారం సాధించాలన్న లక్ష్యం దక్షిణ భారతదేశంలో పార్టీ విస్తరణకు కీలకమవుతుంది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

## బండికి బ్రేకులు..



**కరీంనగర్, జూన్ 11, పెన్ పవర్:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? ఈసారి ప్రచారంలో పాల్గొనే అవకాశం లేదా? గత ఎన్నికల్లో పార్టీ కార్పొరేటర్స్ గెలుపులో కీలకంగా వ్యవహరించారని పేరున్న బండి ఇప్పుడెందుకు దూరం అవుతారు? పార్టీలో అసలా చర్చ ఎందుకు జరుగుతోంది? అది బండి వ్యక్తిగతమా లేక పార్టీ నిర్ణయమా? తెలంగాణలో పదవీ కాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్స్‌కు, గత ఎన్నికల టైంలో వివిధ కారణాలతో ఆగిన మరికొన్ని మున్సిపాలిటీలకు త్వరలోనే ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఆ దిశగా కమలం పార్టీ కూడా గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టింది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లు, వరంగల్ , ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. గత ఎన్నికలలో బీజేపీ గ్రేటర్ పరిధిలో, వరంగల్ లో చెప్పుకోతగ్గ సీట్లే గెలుచుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎవరూ ఊహించనన్ని సీట్లు సాధించింది. అప్పట్లో పార్టీ ఆ స్థాయిలో పనితీరు కనబరచడానికి కారణం నాడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేసిన ప్రచారం ఆయన ప్రసంగాలేనన్న అభిప్రాయం స్థానిక కేడర్‌లో ఉంది. బండి పార్టీలో జోష్ తీసుకురావడంతోపాటు ప్రజలను పార్టీ వైపు ఆకర్షించగలిగారన్నది వాళ్ల మాట. ఆ తర్వాత జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీజేపీ మంచి పెర్ఫార్మెన్స్ చూపించింది. అది కూడా బండి సంజయ్ వల్లనే అనే మాట పార్టీలో ఉంది. మళ్ళీ ఇప్పుడు ఈ రెండు ప్రాంతాల్లో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. దీంతో బండి సంజయ్ రోల్ ఏంటన్న చర్చ మొదలైంది. ఆ మధ్య జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను గెల్చుకుంది బీజేపీ. నెక్స్ట్ మా టార్గెట్ జీహెచ్ఎంసీ అని అప్పుడే అన్నారు బండి సంజయ్. కానీ... ఇప్పుడు మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆయన ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.గత ఎన్నికల టైమ్‌లో బండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు కాబట్టి... అంతటా తిరిగే అవకాశం ఉండేది. కానీ... ఇప్పుడు ఆ ఛాన్స్‌లేదు. పైగా గ్రేటర్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు ఈ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లెక్కలన్నిటినీ చూసుకుంటే....ఈసారి బండి సంజయ్ ఇక్కడ ప్రచారం చేయకపోవచ్చన్న అంచనాలున్నాయి. అలాగే ఇక్కడి నేతలు కొందరికి, ఆయనకు మధ్య గ్యాప్ కూడా ఉందని చెప్పుకుంటున్నారు. ఇలాంటి రకరకాల కారణాలతో బండి సంజయ్ కూడా వ్యక్తిగతంగా గ్రేటర్‌లో ప్రచారంపై ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అయితే హైదరాబాద్‌ని వదిలేసినా వరంగల్‌లో ప్రచారం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ పెద్దలకు కూడా ఇదే విషయం చెప్పినట్టు తెలిసింది. వరంగల్ ఇన్ఛార్జ్‌గా తీసుకొని పని చేస్తే తృప్తి అయినా ఉంటుందని కేంద్ర మంత్రి భావిస్తున్నట్టు సమాచారం. దీంతో పార్టీ పెద్దలు ఆయనకు ఎక్కడ బాధ్యతలు అప్పగిస్తారోనని ఆసక్తిగా చూస్తోంది కేడర్.

## వడివడిగా ఫ్యూచర్ సిటీ అడుగులు

**హైదరాబాద్, జూన్ 11, పెన్ పవర్:**
తెలంగాణ రాజధాని హైదరాబాద్ భౌగోళిక, ఆర్థిక రూపురేఖలను సమూలంగా మార్చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో ఒక చారిత్రాత్మక మైలురాయి ఆవిష్కృతం కాబోతోంది. ఈ మెగా గ్రీన్‌ఫీల్డ్ నగర అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ శాశ్వత కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నిర్మించిన ఈ అత్యాధునిక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా ప్రారంభించి, ఇక్కడి నుంచే ఫ్యూచర్ సిటీ పనుల వేగాన్ని పరుగులు పెట్టించబోతున్నారు.ఈ కార్యాలయ ప్రారంభోత్సవ వేదికగానే తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టే ఒక అంతర్జాతీయ స్థాయి కీలక ఒప్పందం కూడా జరిగింది.దాదాపు 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ నయా నగరానికి సంబంధించి వరల్డ్-క్లాస్ సమగ్ర మాస్టర్ ప్లాన్ ను రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ డిపి ఆర్కిటెక్ట్స్ కు ప్రభుత్వం అప్పగించింది. గ్లోబల్ టెండర్లలో పాల్గొన్న ఆరు దిగ్గజ సంస్థల్లో అత్యంత తక్కువ బిడ్ తో నిలిచిన ఈ సింగపూర్ సంస్థకు, వేదికపైనే సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా 'వర్క్ ఆర్డర్' లేఖను అందజేశారు. రాబోయే తొమ్మిది నెలల కాలంలో ఈ గ్లోబల్ కన్సల్టెంట్ ఫ్యూచర్ సిటీ సమగ్ర బ్లూప్రింట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ జోన్ డెవలప్ మెంట్ పరిధిలో మొదటి విడతగా దాదాపు

30,000 ఎకరాల ప్రధాన జోన్‌పై అధికారులు దృష్టి సారించారు. ఇందులో దాదాపు 13,000 ఎకరాలను 'ప్రయారిటీ డెవలప్‌మెంట్ జోన్' గా గుర్తించి, వివిధ రంగాలకు చెందిన గ్లోబల్ క్లస్టర్లను ఇక్కడ విభజించారు. కొత్త ఆఫీస్ కేంద్రంగానే వీటికి సంబంధించిన పనులు సాగనున్నాయి. ఈ ప్రణాళిక ప్రకారం.. ఫ్యూచర్ సిటీలో 4,000 ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్, 403 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , 2,177 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ ఽ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్, 1,976 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్, 313 ఎకరాల్లో గ్లోబల్ డేటా సెంటర్ హబ్, 594 ఎకరాల్లో హెల్త్ సిటీ, 255 ఎకరాల్లో ఎడ్యుకేషన్ జోన్ , 2,477 ఎకరాల్లో అత్యాధునిక రెసిడెన్షియల్ జోన్‌లను నిర్మించబోతున్నారు. నగరంలో అస్తవ్యస్తంగా పెరుగుతున్న అర్బనైజేషన్ ఒత్తిడిని తగ్గించేందుకు, ఈ ఫ్యూచర్ సిటీని పర్యావరణహితంగా, భారతదేశంలోనే మొట్టమొదటి 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా దాదాపు 15,000 ఎకరాల అటవీ ప్రాంతాన్ని సహజసిద్ధంగా కాపాడుకుంటూనే ఇకో-టూరిజం జోన్లను డిజైన్ చేస్తున్నారు. కాలుష్య రహిత సూత్రాల ఆధారంగా డాక్టర్ రెడ్డీస్, భారత్ బయోటెక్, హెటెరో, ఎంఎస్ఎన్, అరబిందో వంటి ప్రముఖ ఫార్మా దిగ్గజాలు ఇక్కడ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నాయి. వీటికి తోడు అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్ వంటి అంతర్జాతీయ సంస్థల మెగా డేటా సెంటర్లు, ఇప్పటికే పనులు ప్రారంభించుకున్న

'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' శాశ్వత క్యాంపస్, దాదాపు 50 ఎకరాల్లో నిర్మించబోయే లెదర్ ఇండస్ట్రీ స్కిల్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కొత్త క్యాంపస్ పనులను కూడా ఈ కొత్త అథారిటీ కార్యాలయం నుంచే వేగవంతం చేయనున్నారు. రావిర్యాల్ నుండి రీజనల్ రింగ్ రోడ్ లోని ఆమన్ గల్ వరకు దాదాపు రూ.4,621 కోట్లతో మెట్రో కనెక్టివిటీ కలిగిన 'రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్' ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి కూడా పునాది పడనుంది.

# వామపక్షాల దారెటు...

**విజయవాడ, జూన్11, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో వామపక్ష భావజాలం కాస్తా పక్కదారి పట్టినట్టు కనిపిస్తోంది. మొన్నటి ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో కూడా ఇది స్పష్టమైంది. ఇప్పుడు తాజాగా విశాఖపట్నంలో వామపక్షాల నేతలు వ్యవహరించిన తీరు అభ్యంతరకరంగా ఉంది. రాజకీయ ప్రేరేపితం అన్నట్టు వారి ప్రవర్తన ఉంది. కూటమి వచ్చిన తర్వాత వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలకు కొంత స్వేచ్ఛ వచ్చిన మాట వాస్తవం. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో కనీసం నోరు తెరవ లేకపోయారు వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు. అంతలా ఉక్కు పాదం మోపారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇప్పుడు కూటమి వచ్చిన తర్వాత స్వేచ్ఛ ఇస్తే.. మరోలా మాట్లాడుతున్నారు. లేనిపోని వివాదాలు తెచ్చుకుంటున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి వామపక్షాలను ఎంతలా చూశారో అందరికీ తెలిసిన విషయమే.. ఇప్పుడు వారిద్దరి పార్టీలకు మైలేజ్ వచ్చేందుకు ఇదే వామపక్షాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రయత్నిస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది.వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు అంటే ముందుగా గుర్తొచ్చేది సమస్యల పరిష్కారం. కార్మికులతో పాటు ఉద్యోగులు వామపక్షాలను ఆశ్రయిస్తారు. ఎందుకంటే వారు పోరాటం చేస్తే ఏదో ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ. అయితే ఇప్పుడు వామపక్షాలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ ప్రేరేపితం అనే చట్రంలో చిక్కుకుంటున్నాయి. లేనిపోని వివాదాలకు అవకాశం కల్పిస్తున్నాయి. సమస్యలకు పరిష్కారం మరిచి.. మరింత జఠిలం చేస్తున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు సంబంధించి.. బాధితుల పరామర్శకు వెళ్లిన.. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన మంత్రి లోకేష్ పై నిలదీసినంత పని చేశారు. ఆయన సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. చనిపోయింది మీ కుటుంబాలు వారు కాదు కదా? బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు అంటూ.. విరుచుకు పడే దాకా పరిస్థితి వచ్చింది.ఇప్పుడు అనవసరంగా విశాఖకు చెందిన వామపక్షాల నేతలు ట్రోల్ అవుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. నాడు జగన్ సర్కార్ నోరు తెరవలేదు. కనీసం ప్రైవేటీకరణను నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఎప్పుడైతే బిజెపితో టిడిపి, జనసేనకు పొత్తు కుదిరిందో.. నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం యూటర్న్ తీసుకుంది. ప్రైవేటీకరణ ఆగింది. 13 వేల కోట్ల రూపాయల ప్యాకేజీ సమకూరింది. వైసీపీ హయాంలో కొందరు వామపక్షాల నేతలు చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు వైసీపీ నేతలతో. కానీ ఇప్పుడు మాత్రం బాధ్యతగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తుంది. కేంద్ర ఉక్కు శాఖ పర్యవేక్షిస్తుంది. మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు వైసీపీ ట్రాప్ లో పడి వామపక్షాల నేతలు సమస్యలకు పరిష్కారం చూపించాల్సింది పోయి... తామే సమస్యలను సృష్టిస్తున్నారు. వారికి ఉన్న మంచి పేరును చెడగొట్టుకుంటున్నారు

# ఫీల్ గుడ్ తప్ప.. ఫీల్డ్ లో బ్యాడే

**గుంటూరు, జూన్11, పెన్ పవర్:** పల్నాడు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వ్యవహారం గురించి ప్రస్తుతం రకరకాల చర్చలు జరుగుతున్నాయి, కొందరికి కొత్త కొత్త డౌట్స్ వస్తున్నాయి. అసలు ఆయన్ని ఏ కోణంలో చూడాలంటూ పార్టీ వర్గాలే మాట్లాడుకుంటున్నాయి. పైకి మంచి అనిపిస్తున్నా కాస్త లోతుల్లోకి తొంగి చూస్తే ఎక్కడో ఏదో తేడా కొడుతోందని అనేవాళ్ళ సంఖ్య నియోజకవర్గంలోనే పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లోనే తాజాగా టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి ఎంపీ పనితీరుకు సంబంధించిన ప్రశ్నలు సంధించడం కలకలం రేపుతోంది. 2019లో తొలిసారి నరసరావుపేట నుంచి వైసీపీ తరపున గెలిచారు లావు. 2024 ఎన్నికల్లో మరోసారి అక్కడి నుంచే బరిలో దిగాలని అనుకున్నా గుంటూరు పంపాలని నిర్ణయించింది అధిష్టానం. ఆ క్రమంలోనే వైసీపీకి రాజీనామా చేసి కొన్నాళ్ళ తర్వాత టీడీపీ కండువా కప్పుకున్నారాయన. రెండోసారి సైకిల్ గుర్తు మీద నరసరావుపేట ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అందరూ టీడీపీ ఎమ్మెల్యేలే ఉన్నారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా... మెల్లిగా పదవుల పంపకాల్లో శ్రీకృష్ణదేవరాయులుతో పాటు టీడీపీలో చేరిన వారికి ప్రాధాన్యత లభిస్తోందంటూ వివాదం మొదలైంది. వినుకొండకు చెందిన మక్కెన మల్లిఖార్జునరావుకు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కడం వెనక ఎంపీ చొరవ ఉందని పార్టీలో ప్రచారం జరిగింది. అలాగే...లావుతో పాటు టీడీపీలోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం లభించింది. ఎంపీ పరపతిని గట్టిగా వాడటం వల్లే వాళ్ళకు పదవులు వచ్చాయన్న టాక్ గట్టిగా నడిచింది పల్నాడు టీడీపీలో. అటు లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీకి టీడీపీ అధిష్టానం కూడా ప్రాధాన్యం ఇచ్చింది.అదంతా ఒక ఎత్తయితే శ్రీకృష్ణ దేవరాయలు పార్టీలో గ్రూప్స్‌ని ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోందట. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్నప్పుడు కూడా ఆయన గ్రూపులు ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీలో కూడా అదే ట్రెండ్ కొనసాగిస్తున్నారంటూ లోకల్‌గా పార్టీలో అసహనం వ్యక్తం అవుతోంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో ఎంపీకి పొసగడం లేదని చెప్పుకుంటున్నారు. ఎంపీతో సన్నిహితంగా ఉంటాడని పేరున్న నర్సరావుపేట జనసేన నేత తరచూ తమనేతను టార్గెట్ చేస్తూ ఆరోపణల డోస్ పెంచడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు ఎమ్మెల్యే వర్గీయులు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మిగతా ఎమ్మెల్యేలతో ఇప్పటికిప్పుడు విబేధాలు బయటపడకున్నా...అంతర్గతంగా ఏదో నడుస్తోందన్నది ఇంటర్నల్ టాక్. లావు తనతోపాటు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీలో కొంతమంది సీనియర్లకు ఇష్టం లేదట. నియోజకవర్గాల్లో తమ ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలన్న టార్గెట్‌తో... ముందు జాగ్రత్తగా ఎంపీ వర్గీయులకు చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే... తాజాగా ఎంపీ పనితీరు ఎలా ఉందంటూ నియోజకవర్గంలో చాలా మందికి ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. లావుకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పుకుంటున్న టైంలో... ఆయన పనితీరు గురించి టీడీపీ అధిష్టానం సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయలు వ్యవహారశైలి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళ్ళడం వల్లే ఈ సర్వే నిర్వహించారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ తీరు నచ్చని కొంతమంది నేతలైతే. అవును, నిజమే.... అందుకే సర్వే చేశారంటూ బల్ల గుద్దుతున్నారు. మొత్తం మీద నరసరావుపేట టీడీపీలో ఇప్పుడు ఐవీఐర్ఎస్ ప్రకంపనలు రేగుతున్నాయి.

# కర్నూలులోనూ కుప్పం ఫార్ములా...

**కర్నూలు, జూన్11, పెన్ పవర్:** 2024 ఎన్నికల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ బాగా బలహీనంగా ఉండేది. అది ఎంతలా అంటే... 2019లో అసెంబ్లీకి, లోక్‌సభకు జిల్లా నుంచి అస్సలు ప్రాతినిధ్యమే లేనంత. ఇక జెడ్పీ, మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి. ఇక్కడ ఇంకో విచిత్రం ఏంటంటే... పార్టీ క్యాడర్ బలంగా వున్నా, కేవలం నాయకుల మధ్య విబేధాలు, వాళ్ళ మీదున్న వ్యతిరేకత లాంటి కారణాలతోనే టీడీపీ వెనుకబడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ బలహీనంగానే కనిపించింది. కానీ... 2024 ఎన్నికలకు వచ్చేసరికి అనూహ్యంగా పుంజుకుంది తెలుగుదేశం. జిల్లాలోని మొత్తం 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాలకుగాను కూటమి12 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో గెలిచింది. అందులో టీడీపీ వాటానే 11 అసెంబ్లీ , 2 ఎంపీ సీట్లు. దీంతో... ఇక పూర్వ వైభవం వచ్చినట్టేనని సంబరపడ్డారు ఇక్కడి తమ్ముళ్లు. కానీ ఇప్పుడు ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి తిరిగి చూసుకుంటే... మొత్తం తేడాతేడాగానే కనిపిస్తోందట. పరిస్థితి మళ్లీ అధ్వాన్నంగానే మారుతోందన్నఅభిప్రాయం టీడీపీ వర్గాల్లోనే బలపడుతోంది. అందుకు కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం ఒక కారణం అయితే టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో నేతల తీరు మరో కారణం అంటున్నారు. శాసనసభ్యుల తీరు పార్టీకి తీరని నష్టం కలిగించేలా ఉందన్న వాదన బలపడుతోంది.కొందరు ఎమ్మెల్యేలు నిత్యం వివాదాల్లో చిక్కుకోవడం, నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, భూ కబ్జా ఆరోపణలు, అక్రమ రిజిస్ట్రేషన్లతో భూములు సొంతం, దౌర్జన్యాలు, అనుచరుల ఆగడాలు వెరసి కూటమి ప్రభుత్వానికి మరకలు అంటుకునేలా చేస్తున్నాయన్నది కేడర్ వాయిస్. వీటన్నిటికీ మించి ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు పార్టీని వీడిపోవడం, దూరంగా ఉండడం లాంటివి నష్టం కలిగిస్తున్నట్టు చెబుతున్నారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయట. దీంతో.. ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో కూడా కుప్పం ఫార్ములాను అప్లయ్ చేస్తారా అంటూ తాజా చర్చలు జరుగుతున్నాయి. తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ నేతలు గాడి తప్పుతున్నారని గుర్తించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ వ్యవహారాలను చూస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను ఉన్నఫళంగా బాధ్యతల నుంచి తప్పించడం హాట్ టాపిక్ అయింది. దాంతో.. గాడి తప్పుతున్న కర్నూలు వ్యవహారాలను కూడా అదే స్పీడ్‌తో, అంతే స్ఫూర్తితో సెట్ చేస్తారా అంటూ మాట్లాడుకుంటున్నాయి పార్టీ వర్గాలు. పార్టీని చక్కదిద్దేందుకు చంద్రబాబు తన నియోజకవర్గం నుంచే ఆపరేషన్ ప్రారంభించారని, జిల్లాలోనూ ఆ ఫార్ములాను అమలు చేస్తే బాగుంటుందని కొందరు అంటుంటే... అలా చేస్తారా అంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టేవాళ్ళు మరికొందరు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను. 8 నుంచి 10 చోట్ల అంతర్గత సమస్యలతో సతమతం అవుతోంది టీడీపీ. ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు

తీవ్రస్థాయిలో ఉన్నట్టు అధిష్టానం దగ్గర కూడా నివేదికలు ఉన్నాయట. ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్న నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇటీవల సమీక్షించిన చంద్రబాబు ఒక హెచ్చరిక కూడా పంపారట. నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో నేరుగా చెప్పి స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం. అయినా సరే... కొందరి తీరు మారడం లేదనే అభిప్రాయం కూడా పెరుగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో అందర్నీ సెట్ చేయాలంటే... కుప్పం తరహా ట్రీట్ మెంట్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అందులోనూ.... మా నియోజకవర్గంలోనే కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ ఎమ్మెల్యేలపై అసంతృప్తిగా ఉన్న కొందరు ఆల్రెడీ ప్రచారం మొదలుపెట్టేశారట. అలాంటి వాళ్ళంతా స్థానిక పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. కుప్పం తరహా ట్రీట్‌మెంట్ ఒక్కరికి ఇచ్చినా... మిగతా నియోజకవర్గాలన్నిటిలో ఎక్కడి వాళ్ళు అక్కడ సెట్ అవుతారన్న అభిప్రాయం పెరుగుతోంది.

# టీజీ వర్సెస్ బైరెడ్డి లేటెస్ట్ గా వెంకటేష్ ఎంట్రీ

**కర్నూలు, జూన్ 11, పెన్ పవర్:** కర్నూలు రాజకీయాలు వేడెక్కాయి. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన వివాదంలోకి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. సిద్ధార్థ్ రెడ్డి నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలంటూ టీజీ వెంకటేష్ పరోక్షంగా హెచ్చరించారు. ఆయన తాత తనకు బాగా పరిచయమని.. ఆ పరిచయంతోనే మంచిగా మాట్లాడేది నేర్చుకోమని చెప్తున్నానని సలహా ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే తాము ఊరుకున్నా.. తమ కార్యకర్తలు నాలుక కట్ చేస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు.రాయలసీమ రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి, టీజీ కుటుంబానికి మధ్యన మాటల యుద్ధం నడుస్తోంది, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వర్సెస్ టీజీ భరత్ గా మొదలైన కర్నూలు రాజకీయం.. ఇప్పుడు మరో టర్న్ తీసుకుంది. ఇందులోకి మంత్రి టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేష్ ఎంట్రీ ఇచ్చారు. టీజీ భరత్, బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి మధ్య మొదలైన ఈ సవాళ్లు- ప్రతి సవాళ్లలోకి టీజీ వెంకటేష్ ప్రవేశించారు. బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పేరు ప్రస్తావించకుండానే స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎగిరెగిరి పడినవాళ్లంతా చల్లారిపోయారని.. మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని టీజీ వెంకటేష్ హెచ్చరించారు."కొంతమంది అప్పుడప్పుడూ ఎగిరిపడుతుంటారు. ఇటీవలే ఒకడు ఎగిరిపడ్డాడు. ఆ అబ్బాయికి సంవత్సరం కిందటే ఓసారి మాటల్లో చెప్పా. నీ పేరు అందరికీ తెలిసింది. భవిష్యత్తు బాగుంటుంది. జాగ్రత్తగా మాట్లాడి, నోరుపారేసుకోకుండా బాగా మాట్లాడేది నేర్చుకోమని చెప్పా. ఎక్కడో వారిపై ప్రేమ ఉండేది. ఎందుకంటే వాళ్ల తాత నాకు క్లోజ్. చాలా సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నాం. ఆ పరిచయాలతోనే చెప్పా. కుటుంబంలో నికృష్టుడు పుడుతుంటారు. మంచి కుటుంబాల్లోనూ దరిద్రులు పుడుతుంటారు. అలాంటి వారికి బుద్ధి చెప్పే విధానాలు వేరుగా ఉంటాయి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు ఇలా చూస్తాం."" రాయలసీమలో మీసాలు తిప్పుకున్నోళ్లంతా, మీసాలు దింపుకుని మాతో సహకరించారు. ఏదో వందమంది రౌడీలను వేసుకుని ఎగిరిపడుతున్నారు. ఆ పిల్లోడికి చెప్పేదొక్కటే. వాళ్లు 100 మందిని తెస్తే మేము వేయిమందిని తెస్తాం. వాళ్లు వేయిమందిని తెస్తే మేము పదివేల మందిని తేగలం.. 10 వేల మందిని తెస్తే.. లక్ష మందిని తెస్తాం. వాళు లక్ష రూపాయలు ఖర్చుచేస్తే.. నేను కోటి రూపాయలు ఖర్చు చేయగలను. నోరు పారేసుకుంటే మేమేమీ చేయకపోయినా.. మా కార్యకర్తలు ఎవరో ఒకరు నాలుక కట్ చేస్తారు.. జాగ్రత్తగా ఉండాలి" అంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి టీజీ వెంకటేష్ వార్నింగ్ ఇచ్చారు.కర్నూలు చెందిన సతీష్ అనే దళిత యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సతీష్ కుటుంబానికి ఓ ఫార్మా కంపెనీ నుంచి డబ్బులు అందాయంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపించటంతో ఈ వ్యవహారం మొదలైంది. సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలని అడుగుతున్నందుకు అధికార పార్టీ తనను బెదిరిస్తోందన్న బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి.. ఈ క్రమంలోనే టీజీ భరత్ మీద అవినీతి ఆరోపణలు చేశారు. అయితే బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి టీజీ భరత్.. సిద్ధార్థ్ రెడ్డిని జోకర్ అంటూ విమర్శించారు. సిద్ధార్థ్ రెడ్డి మీద పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చిన టీజీ వెంకటేష్.. నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలంటూ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు

# రూట్ మార్చిన కొల్లగట్ట...

**విజయనగరం జూన్ 11, పెన్ పవర్:** విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు మాజీ డిప్యూటీ స్పీకర్ వ్యవహారంపై హాట్ హాట్ డిస్కషన్స్ నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా కోలగట్ల వీరభద్రస్వామి సొంత పార్టీ వైసీపీ నాయకులకైతే ఆయన అంతరంగం అంతుచిక్కక గందరగోళ పడుతున్నారట. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా కనిపించే స్వామి. ఇప్పుడు ఎందుకు గడప దాటటం లేదు? యాక్టివ్‌గా కనిపించడం లేదంటూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ క్రమంలోనే... కొన్ని కొత్త సంగతులు తెలుస్తున్నాయట. మాజీ డిప్యూటీ స్పీకర్ తన వారసురాలి రాజకీయ భవిష్యత్ విషయమై ఆందోళనగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే ఒకడుగు వెనక్కేస్తున్నారన్నది ఇంటర్నల్ టాక్. ఒకప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సమావేశాలు, నిరసనలు అంటూ నిత్యం ప్రజల మధ్యనే కనిపించేవారాయన. కానీ కొంతకాలంగా రాజకీయంగా నెమ్మదించారన్నది జిల్లాలో ఉన్న విస్తృతాభిప్రాయం. దాంతో గతంలో కనిపించినంత చురుగ్గా ఎందుకు లేరంటూ పార్టీ వర్గాలు సైతం సమాధానాలు వెదికే ప్రయత్నంలో ఉన్నాయి. తన సహజ శైలికి భిన్నంగా ప్రస్తుతం పార్టీ కార్యక్రమం ఉంటే హాజరవుతున్నారు. నాయకత్వం పిలిస్తే ముందుకొస్తున్నారు తప్ప యాక్టివ్ రోల్ తీసుకోవడం లేదు.అయితే ఈ మౌనం వెనుక ఉన్నది రాజకీయ వ్యూహమా? లేక కుటుంబ రాజకీయ భవిష్యత్తుపై ఆలోచనలా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి సమాధానంగానే వినిపిస్తోంది వారసత్వ వ్యవహారం. తన కుమార్తె శ్రావణి రాజకీయ భవిష్యత్తుపై కోలగట్ల ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు. ఆమె గతంలో డిప్యూటీ మేయర్ బాధ్యతలు కూడా నిర్వహించినందున ఇక మీదట తనకు బదులుగా కుమార్తెను పొలిటికల్‌గా ప్రమోట్ చేయాలని భావిస్తున్నారట. ఆమె రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసే క్రమంలోనే... వైసీపీ అధిష్టానం మీద వత్తిడి తెచ్చేలా వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్నది లోకల్ టాక్. ముఖ్యంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిపై కోలగట్ల కన్నుపడిందని అంటున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తన కుమార్తె శ్రావణిని పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా ప్రకటించాలని, ఆ మేరకు ఇప్పుడే తనకు హామీ ఇవ్వాలని వీరభద్రస్వామి పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఛాన్స్ దొరికినప్పుడే ఉపయోగించుకుంటూ... తాను పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉన్నప్పుడే కుమార్తె భవిష్యత్‌కు బాటలు వేయాలని అనుకుంటున్నారట కోలగట్ల. అందుకే పార్టీ అధిష్టానం నుంచి హామీ కోరుతూ... ఆ విషయంలో క్లారిటీ వచ్చేదాకా కామ్ ఉండాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పార్టీ నాయకత్వం మాత్రం అలాంటి హామీలకు ఇది సమయం కాదని అంటున్నట్టు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంలో క్లారిటీ లేదు. అప్పటికి రాజకీయ సమీకరణలు ఎలా మారతాయో తెలియదు.

# జగన్ కొత్త టీమ్...

**నెల్లూరు, జూన్ 11, పెన్ పవర్:** జగన్మోహన్ రెడ్డికి ఒక కోర్ టీం ఉంది. చాలా దగ్గరగా మెలిగే ఒక బృందం ఉంది. ఆయన చుట్టూ ఒక రక్షణ కవచంలా ఉంటుంది. ఆయన రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కోర్ కమిటీ లో కీలక వ్యక్తులు చేరుతూ వచ్చారు. నాగేశ్వర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉండేవారు. కృష్ణమోహన్ రెడ్డి ఓ ఎస్ డి గా వ్యవహరించేవారు. సీఎంగా మారిన తర్వాత ధనుంజయ రెడ్డి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా ఉండేవారు. సజ్జల రామకృష్ణారెడ్డి సలహాదారుడిగా మెలిగారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే గట్టి మద్దతుదారుడిగా నిలిచారు. కానీ తాజాగా వీరందరినీ పక్కనపెట్టి కొత్త టీం ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన కలత చెందారట. చుట్టూ వీరిని ఉంచుకొని రాజకీయాలు చేయలేనని భావించి.. కొత్త టీం ను రంగంలోకి దించేందుకు సిద్ధమయ్యారట.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయంతో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీ పై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. వారి తీరుతోనే పార్టీ నేతలకు అధినేతకు మధ్య గ్యాప్ వచ్చిందని విమర్శలు వచ్చాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడే జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోర్ టీం పై అనేక రకాల ఫిర్యాదులు ఉన్నాయి. కానీ అధికారంలో ఉన్నప్పుడు ఇవి సహజం అని చాలా లైట్ తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అటు అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఈ కోర్ టీం కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయింది. అయితే తనకు అండగా నిలిచినందునే ప్రభుత్వం టార్గెట్ చేసిందని భావించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఎప్పుడైతే మద్యం కుంభకోణంలో నమ్మలేని నిజాలు బయటపడ్డాయో అప్పటినుంచి ఆలోచనలో పడ్డారు.సాధారణంగా అధికార పార్టీ అంటేనే అవినీతి అనేది ఉంటుంది. ఆ ఆరోపణలు కూడా వస్తుంటాయి. అదే మాదిరిగా తన చుట్టూ ఉన్న కోర్ టీం పై అవినీతి ఆరోపణలు వచ్చి ఉంటాయని జగన్మోహన్ రెడ్డి భావించారు. కానీ ఒక్కొక్కరి అక్రమ సంపాదనను ప్రత్యేక దర్యాప్తు బృందం బయటపెడుతోంది. మరోవైపు కేంద్ర సంస్థ ఈడీ సైతం వెల్లడిస్తోంది. తన వ్యక్తిగత సహాయకుడి వద్ద వందల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడేసరికి జగన్ సైతం ఆశ్చర్యపోయారట. తాను ఎంతో నమ్మిన అధికారులుగా తన వద్ద పెట్టుకున్న వారు సైతం భారీగా పోగేసుకోవడాన్ని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అయితే అత్యంత వీర విధేయుడుగా మెలిగిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ సంపాదన చూసి ఆశ్చర్యపోయారట. సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరం చేతికి మట్టి అంటకుండా చేసిన దోపిడీ గురించి తెలుసుకొని జగన్ బాధపడ్డారట. ఇంతకాలం ఇటువంటి వారిని చుట్టూ పెట్టుకున్నానా? అని బాధపడుతున్నారట. అందుకే కోర్ టీం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారట.వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. ఆ సమయానికి తన చుట్టూ ఉన్న టీం ను మార్చే పనిలో ఉన్నారట. గతంలో విజయసాయిరెడ్డి ఉండేవారు. ఆయన సైతం బయటకు వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు నమ్మకస్తులుగా భావించిన కోర్ టీం నట్టేట ముంచెయ్యడంతో జగన్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే జగన్ కొత్త టీం లో ఎవరు చేరుతారు అనేది ఇప్పుడు ప్రశ్నార్థకం. రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్ కోర్ టీంలో ఎవరు చేరుతారు? అనే సందేహాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# వైసీపీ కాపు రాజకీయం...



**కాకినాడ, జూన్ 11, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029 ఎన్నికల లక్ష్యంగా చాలా రకాల వ్యూహాలు పన్నుతోంది. అందులో భాగంగా పార్టీ జనసేన పై ఫుల్ ఫోకస్ పెట్టింది. జనసేన ను దారుణంగా దెబ్బతీయాలని చూస్తోంది. కాపులను జనసేనకు దూరం చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని.. అదే జరిగితే ఇతర పక్షాల మద్దతుతో చాలా సులువుగా అధికారంలోకి రావచ్చని అంచనా వేస్తోంది. అయితే అది అంత తేలికైన విషయం మాత్రం కాదు. ముఖ్యంగా జనసేన నుంచి కాపులను ఇప్పట్లో వేరు చేయడం కుదిరే పని కాదు. ఎందుకంటే కాపులు పవన్ కళ్యాణ్ విషయంలో కొంత సంతృప్తితో అయితే మాత్రం ఉన్నారు. తమ వాడు డిప్యూటీ సీఎం పదవి వరకు వచ్చాడు అని.. ఏపీలో పాలనలో భాగస్వామ్యం అవుతున్నాడని.. ఆయన నిర్ణయాలకు గౌరవం లభిస్తుందని వారిలో సంతృప్తి ఉంది. అయినా సరే కాపులను విభజిస్తే తప్ప రాజకీయాలు చేయలేమని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. కాపుల మద్దతు కోసం ఒకవైపు.. జనసేనకు దూరం చేసేందుకు మరోవైపు జగన్ చేయని ప్రయత్నం అంటూ లేదు.ప్రస్తుతం కాపులు పవన్ కళ్యాణ్ వెంట ఉన్నారు. కాపు నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కురసాల కన్నబాబు.. ఇలా పేరు మోసిన నేతలంతా జగన్మోహన్ రెడ్డి వెంట ఉన్నారు. అయితే వీరి ద్వారా కాపులను ఆకర్షించే ప్రయత్నం చేయడం లేదు జగన్మోహన్ రెడ్డి. ఎందుకంటే వీరు ఆకర్షించే స్థితిలో లేరు. ఎంతవరకు పవన్ పై విమర్శలు చేయగలరే తప్పించి.. వీరికి మరో పని చేతకాదు. పోనీ ముద్రగడ పద్మనాభం, హరి రామ జోగయ్య లాంటి వారిని తిరిగి ప్రయోగిస్తామంటే కాపులు మరింతగా తిరస్కరిస్తారు. ఈ విషయం జగన్మోహన్ రెడ్డికి తెలుసు కూడా. అందుకే కొత్త కాపుల కోసం ఆయన అన్వేషిస్తున్నారు. అందుకే దాసరి రాము, వంగవీటి కుటుంబం వంటి వారిపై ఆశలు పెట్టుకున్నారు.పవన్ కళ్యాణ్ టిడిపి తో పొత్తు పెట్టుకోకుండా హరిరామ జోగయ్య పేరు చెప్పుకొని చాలా ప్రయత్నాలు చేశారు అప్పట్లో. ఒకవేళ పొత్తు పెట్టుకున్న సగానికి పైగా సీట్లు కావాలని కోరారు. పవన్ కళ్యాణ్ ను కోరమని చెప్పారు. లేకుంటే పొత్తు వద్దు అని తేల్చేయమని సలహా ఇచ్చారు. ఎప్పటికప్పుడు హరి రామ జోగయ్య పేరుతో లేఖలు రాసి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి చేసే ప్రయత్నం చేశారు. ముద్రగడ పద్మనాభం అయితే జనసేనలోకి వచ్చి.. తనదైన వైసీపీ ప్రయోజనాల కోసం కృషి చేయాలని చూశారు. దానిని ముందుగానే గ్రహించారు పవన్ కళ్యాణ్. అందుకే జనసేనలోకి ముద్రగడ ఎంట్రీని లేకుండా చేశారు. ఆ కోపంతోనే ముద్రగడ వైసీపీలోకి వెళ్లారు. పవన్ ను ఓడిస్తానని శపథం చేశారు. ఓడించలేక పద్మనాభ రెడ్డి గా పేరు మార్చుకున్నారు.జగన్మోహన్ రెడ్డి ముందుగా హరి రామ జోగయ్యను వాడేసారు. తరువాత ముద్రగడ పద్మనాభంను వాడేసారు. ఇప్పుడు కొత్తగా వాడేందుకు దాసరి రాము కనిపిస్తున్నారు. అవసరం అనుకుంటే వంగవీటి కుటుంబంలో ఒకరిని తెచ్చి కాపు రాజకీయంతో కాక రేపాలని చూస్తున్నారు. కానీ వారు ముందుకు వస్తారా లేదా అన్నది చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఢిల్లీ షేక్ అయ్యేలా పవన్ 'సేన గళం'.. అసలు ఏంటిది.. ?



దేశ రాజధాని హస్తిన రాజకీయాల్లో ఇప్పుడు ఒక ప్రాంతీయ పార్టీ పేరు మారుమోగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఈసారి ఏకంగా ఢిల్లీ వేదికగా సరికొత్త పొలిటికల్ బాంబ్ పేల్చబోతున్నారు. సుమారు 150 మంది పార్టీ ముఖ్య నేతలతో కలిసి మూడు రోజుల పాటు ఆయన హస్తినలో చేయబోయే హడావుడి వెనుక ఒక బలమైన ఎజెండా ఉంది. ప్రాంతీయ పార్టీలు సాధారణంగా నిధుల కోసమో, రాష్ట్ర ప్రాజెక్టుల కోసమో ఢిల్లీ వెళ్లడం చూస్తుంటాం. కానీ, పవన్ కల్యాణ్ ఒక సరికొత్త పొలిటికల్ ఐడియాలజీని దేశానికి పరిచయం చేయడానికి వెళ్తుండటమే ఇక్కడ అసలు ట్విస్ట్. పవన్ కల్యాణ్ సుదీర్ఘ ఆలోచనల నుంచి పుట్టిన సరికొత్త భావజాలమే ఈ 'సేన గళం'. ఇది కేవలం ఒక రాజకీయ విభాగం మాత్రమే కాదు.. దేశంలోని నూతన తరం యువత మనోభావాలకు అద్దం పట్టే ఒక వేదిక. ప్రస్తుతం ఉన్న యువత పాతకాలపు కుల, ప్రాంతీయ సమీకరణాల కంటే పారదర్శకతను, రాజ్యాంగ విలువలని ఎక్కువగా కోరుకుంటోంది. వారి ఆశయాలకు ఒక పొలిటికల్ షేప్ ఇస్తూ.. జనసేన కేవలం ఏపీకే పరిమితమైన ప్రాంతీయ శక్తే కాదు, దేశవ్యాప్త యువత ఆలోచనలను ప్రభావితం చేయగల జాతీయ స్థాయి సిద్ధాంతాలున్న పార్టీ అని చాటిచెప్పడమే ఈ 'సేన గళం' ముఖ్య ఉద్దేశం. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఒక కొత్త వికృత ధోరణి కనిపిస్తోంది. ఎవరో వ్యక్తిగతంగా తప్పు చేస్తే.. దాన్ని ఒక సామాజిక వర్గానికి ఆపాదిస్తూ సోషల్ మీడియా వేదికగా కులాల మధ్య చిచ్చులు పెడుతున్నారు. ఇలాంటి చీప్ పాలిటిక్స్‌ను పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తప్పు చేసిన వాడిని శిక్షించాలి తప్ప, సమాజాన్ని విడదీయకూడదనే హెల్తీ మెసేజ్‌ను ఆయన బలంగా నమ్ముతున్నారు. ఈ సరికొత్త సామాజిక సామరస్య సందేశాన్ని నేషనల్ మీడియా ముఖంగా దేశవ్యాప్తంగా చర్చకు పెట్టడమే పవన్ కల్యాణ్ ప్రధాన లక్ష్యం. ఈ ఢిల్లీ టూర్ వెనుక కేవలం ఐడియాలజీ మాత్రమే కాదు.. పక్కా పొలిటికల్ స్కెచ్ కూడా ఉంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి అత్యంత నమ్మకమైన భాగస్వామిగా ఉన్న పవన్, ఒకేసారి 150 మంది క్యాడర్‌తో ఢిల్లీలో ల్యాండ్ అవ్వడం ద్వారా తన పొలిటికల్ స్ట్రెంత్‌ను బీజేపీ పెద్దలకు చూపించబోతున్నారు. ఏపీలో టీడీపీతో కలిసి సక్సెస్‌ఫుల్‌గా ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ, జాతీయ స్థాయిలో జనసేనకు అంటూ ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని, గుర్తింపును కాపాడుకునే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. గత ఎన్నికల్లో సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్‌తో ఇప్పటికే పవన్ గ్రాఫ్ జాతీయ స్థాయిలో పీక్స్‌లో ఉంది. సనాతన ధర్మం, పర్యావరణం, గుడ్ గవర్నెన్స్ వంటి అంశాలపై ఆయన విజన్‌కు ఈ 'సేన గళం' పర్యటన ఒక లాంచ్ ప్యాడ్‌లా మారబోతోంది.

# భారతదేశపు తొలి మహిళా గూఢచారి.. స్వాతంత్ర్య సమరంలో సాహస గాధ!



భారతదేశ స్వాతంత్ర పోరాటంలో అనేక మంది మహానుభావులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారు.. కానీ, మన చరిత్ర పుస్తకాలు మరిచిపోయిన ఒక అద్భుతమైన వీరనారి కథే నీరా ఆర్య. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' లో మొదటి మహిళా గూఢచారిగా పనిచేసిన ధీరవనిత ఆమె. దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు, పడిన కష్టాలు వింటే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఆ వివరాలు చూద్దాం..

**దేశం కోసం భర్తనే బలి చేసిన ధీరురాలు:**
నీరా ఆర్యకు దేశమే ప్రాణం. ఆమె భర్త శ్రీకాంత్ జయరంజన్ దాస్ బ్రిటిష్ ప్రభుత్వంలో సీఐడీ అధికారిగా పనిచేసేవాడు. ఒకరోజు అతను సుభాష్ చంద్ర బోస్ ను హత్య చేయాలని కుట్ర పన్నాడు. ఈ విషయం తెలిసిన నీరా ఆర్య, దేశ నాయకుడి ప్రాణాలను కాపాడేందుకు తన భర్తనే కనికరం లేకుండా హతమార్చింది. భర్త కంటే దేశమే గొప్పదని ఆమె తన చర్యతో నిరూపించింది.

**అండమాన్ జైలులో బ్రిటీషర్ల నరకయాతన:**
భర్తను చంపిన నేరానికి బ్రిటిష్ ప్రభుత్వం నీరా ఆర్యకు అండమాన్‌లోని ప్రసిద్ధ సెల్యులార్ జైలులో జీవిత ఖైదు విధించింది. అక్కడ బ్రిటీష్ జైలర్లు ఆమెను దారుణంగా హింసించారు. "నేతాజీ ఎక్కడ ఉన్నాడో చెబితే నిన్ను ఇప్పుడే వదిలేస్తాం" అంటూ ఆశ చూపారు. కానీ, ఆమె శత్రువుల ముందు అస్సలు లొంగలేదు. ఇక నోరు విప్పి ఒక్క రహస్యం కూడా బయటపెట్టలేదు.

**గుండెల్ని పిండేసే ఆనాటి భయంకర సంఘటన:**
ఆమె నోరు విప్పడం లేదని కోపంతో ఊగిపోయిన ఒక జైలర్, అత్యంత అమానుషంగా ప్రవర్తించాడు. ఒక పదునైన ఇనుప పటకారును తీసుకువచ్చి, ఆమె రొమ్మును దారుణంగా కోసి ముక్కలు చేశాడు. ఇక ఆ సమయంలో నరకప్రాయమైన బాధను అనుభవిస్తూ, రక్తం ఓడుతున్నా కూడా ఆమె గట్టిగా "జై హింద్" అని నినదించిందే తప్ప, నేతాజీ గురించిన సమాచారాన్ని శత్రువులకు చిక్కనివ్వలేదు.

**స్వతంత్ర భారతంలో దయనీయ స్థితి:**
భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నీరా ఆర్య జైలు నుండి విడుదలయ్యారు. కానీ, మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఈ వీరనారికి స్వతంత్ర భారతంలో దక్కాల్సిన కనీస గౌరవం దక్కలేదు. ఇక ఆమె తన చివరి రోజుల్లో మన హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్రాంతంలో ఒక చిన్న పూరి గుడిసెలో నివసించారు. బ్రతుకుదెరువు కోసం పూలు అమ్ముకుంటూ తీవ్రమైన పేదరికంలో గడిపి, 1998లో కన్నుమూశారు. చరిత్ర మన ఈ 'ఫస్ట్ లేడీ స్పై'ని గుర్తించడంలో విఫలమై ఉండవచ్చు, కానీ భారతీయులుగా మన గుండెల్లో ఆమె త్యాగం ఎప్పటికీ సజీవంగా ఉంటుంది. ఇక తన వ్యక్తిగత జీవితాన్ని, సుఖాలను వదిలేసి దేశ స్వేచ్ఛ కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన నీరా ఆర్య గారి వీరత్వం నేటి తరానికి ఎంతో ఇన్స్పిరేషనల్. ఆ వీరనారి అమరత్వానికి, దేశభక్తికి మనందరం తలవంచి శతకోటి వందనాలు సమర్పించుకుందాం..

# అర్జున్ టెండూల్కర్ పాకిస్తాన్‌లో ఉండి ఉంటే.. భారత్ మెరిట్‌పై షాహిద్ అఫ్రిదీ సంచలన వ్యాఖ్యలు!

**అర్జున్ టెండూల్కర్ పాకిస్తాన్‌లో ఉండి ఉంటే.. భారత్ మెరిట్‌పై షాహిద్ అఫ్రిదీ సంచలన వ్యాఖ్యలు!**
**భారత క్రికెట్‌లో పారదర్శకతను వివరించడానికి అఫ్రిది క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌ను ఒక ప్రధాన ఉదాహరణగా పేర్కొన్నారు.**




భారత, పాకిస్తాన్ క్రికెట్ జట్ల మధ్య ఉన్న వ్యత్యాసాలపైనా.. ఆటగాళ్ల ఎంపిక విధానంపైనా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక ఇంటర్వ్యూలో అతడు మాట్లాడుతూ.. ప్రస్తుతం పాకిస్తాన్ క్రికెట్‌కు, భారత క్రికెట్‌కు అసలు పోలికే లేదని స్పష్టం చేశారు. టీమిండియాలో ప్రతిభ(మెరిట్)కు ఇచ్చే ప్రాధాన్యత వల్లే వారు ప్రపంచంలోనే అత్యుత్తమ టీమ్‌గా దూసుకుపోతున్నారని... అదే సమయంలో పాకిస్తాన్‌లో మాత్రం బంధుప్రీతి (ఫేవరిటిజం) ఎక్కువగా ఉండటం వల్లే జట్టు వెనుకబడిపోతోందని అఫ్రిది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత క్రికెట్‌లో పారదర్శకతను వివరించడానికి అఫ్రిది క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌ను ఒక ప్రధాన ఉదాహరణగా పేర్కొన్నారు. సచిన్ అంతటి గొప్ప ఆటగాడి కుమారుడైనా అర్జున్ టెండూల్కర్‌కు భారత జట్టులో లేదా ఐపీఎల్‌లో ఎలాంటి ప్రత్యేక రాయితీలు దక్కలేదని ఆయన గుర్తు చేశారు.

అర్జున్ గత మూడు, నాలుగేళ్లుగా ఐపీఎల్‌లో ఒక భాగంగా ఉన్నాడు. కానీ ఇప్పటివరకు అతడు ఆడింది కేవలం కొన్ని మ్యాచ్‌లు మాత్రమే. భారత జాతీయ జట్టు సంగతి పక్కన పెడితే ఐపీఎల్‌లో కూడా అతడికి క్రమం తప్పకుండా అవకాశాలు రావడం లేదు! అని అఫ్రిది వ్యాఖ్యానించారు.
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో సచిన్ కొడుకు అనే ట్యాగ్ ఉన్నా... అర్జున్ టెండూల్కర్ మిగతా సాధారణ ఆటగాళ్లలాగే బెంచ్‌కే పరిమితమై మైదానంలో సహచర ఆటగాళ్లకు డ్రింక్స్ (నీళ్లు) అందిస్తున్న విషయాన్ని అఫ్రిది ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్‌లో ఎంతటి సెలబ్రిటీ వారసుడైనా సరే ప్రతిభ చూపిస్తేనే తప్ప జట్టులో స్థానం దక్కదని చెప్పడానికి ఇదొక నిదర్శనమని ఆయన కొనియాడారు. కేవలం బ్యాక్‌గ్రౌండ్ చూసి భారత్‌లో ఎవరికీ అవకాశాలు ఇవ్వరనే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు.

ఇదే సందర్భంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) లోని లోపాలను, ఎంపిక విధానాలను అఫ్రిది తీవ్రంగా ఎండగట్టారు. ఒకవేళ అర్జున్ టెండూల్కర్ కనుక పాకిస్తాన్‌లో పుట్టి ఉంటే ఈపాటికి ఆయన అన్ని ఫార్మాట్లలో (టెస్ట్, వన్డే, టీ20) అంతర్జాతీయ క్రికెట్ ఆరంగేట్రం (డెబ్యూ) చేసి ఉండేవాడు. ఇక్కడ ఉండే ఫేవరిటిజం సంస్కృతికి ప్రతి మ్యాచ్ లోనూ ఆయనకు ఆడే అవకాశం ఇచ్చేవారు! అని అఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌లో అర్హత లేకపోయినా రికమండేషన్లతో ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటారనే విషయాన్ని అతడు ఒప్పుకున్నారు.
భారత జట్టు ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో కొనసాగడానికి... పాకిస్తాన్ జట్టు రోజురోజుకూ దిగజారిపోవడానికి ఈ ఎంపిక విధానమే ప్రధాన కారణమని అఫ్రిది విశ్లేషించారు. భారత్‌లో కేవలం ప్రతిభ ఆధారంగానే న్యాయంగా ఎంపికలు జరుగుతాయని.. అందుకే వారు విజయాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ తరహా కఠినమైన – పారదర్శకమైన నిర్ణయాలు పాకిస్తాన్ క్రికెట్‌లో రానంత వరకు తమ జట్టు ముందడుగు వేయడం కష్టమని అఫ్రిది చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీశాయి.

# జెన్ జీ, జెన్ ఆల్ఫా.. తొలిసారి జగన్ ఇంట్రస్టింగ్ కామెంట్స్



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి తొలిసారిగా జెన్ జీ కోసం మాట్లాడారు. ప్రస్తుతం ఇంటర్ నెట్ సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీతోపాటు భావితరంగా చెబుతున్న జెన్ ఆల్ఫాపైనా జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది కాలంగా రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతున్న జెన్ జీపై జగన్ తొలిసారిగా స్పందించడంపై విస్తృత చర్చ జరుగుతోంది. మెగా డీఎస్సీలో పొరపాట్లను సరిదిద్దాలని ప్రభుత్వానికి సూచన చేసిన జగన్.. ప్రభుత్వం చేసిన తప్పులను సమర్థించుకోవాలని చూస్తే జెన్ జీ ఒప్పుకోదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అంతా లీకుల మయమేనని వైసీపీ అధినేత జగన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీలో ఉద్యోగాల ఎంపిక ప్రక్రియపై ఆయన మండిపడ్డారు. తాడేపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు హయాంలో జరిగిన పేపర్ లీకేజీల చిట్టాను జగన్ చదివి వినిపించారు. చంద్రబాబు పాలనలో లీకేజీలకు ఒక పెద్ద రికార్డే ఉందని జగన్ ఎద్దేవా చేశారు. 1995లో టెన్త్ క్లాస్ పేపర్ల లీక్ తో మొదలు 1996లో ఎమ్‌సెట్ ఇంజినీరింగ్, 1997లో ఇంటర్మీడియట్, 2017లో టెన్త్ సైన్స్, 2019లో టెన్త్, 2025లో బీఈడీ, టెన్త్ మ్యాథ్స్ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకైన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు తాజాగా డీఎస్సీ టీచర్ల రిక్రూట్‌మెంట్ పేపర్ కూడా లీక్ అయిందని ఆరోపించారు. "లీకుల్లో చంద్రబాబు రికార్డు ఇదీ" అంటూ జగన్ ఘాటుగా విమర్శించారు.

**జెన్–జీ కాలం బాబూ.. ఆపలేరు**
ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతుంటే చంద్రబాబుకు నరాలు తెగిపోయేంత బీపీ వస్తోందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపైనా కేసులు పెడుతున్నారు, అరెస్టులు చేస్తున్నారు, భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ చంద్రబాబు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. ఇది జెన్–జీ (Gen-Z) కాలం.. ఇప్పుడు జెన్ ఆల్ఫా (Gen Alpha) కూడా నడుస్తోంది. దేన్నీ మీరు ఆపలేరు. మీరు ఆపేకొద్దీ ఇది ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరుగుతుంది. దగాపడ్డ యువత మిమ్మల్ని విడిచిపెట్టదు.. తగిన గుణపాఠం చెప్తుంది. ఏపీలో కూడా త్వరలోనే 'కాక్రోచ్‌లు' బయటకు వస్తాయి.. జాగ్రత్త!" అంటూ జగన్ హెచ్చరించారు.

**సీబీఐ దర్యాప్తునకు డిమాండ్**
డీఎస్సీ లీకేజీ వ్యవహారంలో ఇన్ని ఆధారాలు ఉన్నాయి కాబట్టే తాము సీబీఐ దర్యాప్తునకు పట్టుబడుతున్నామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఈ స్కామ్‌పై లోతుగా విచారణ జరిపితే మరిన్ని సంచలన విషయాలు బయటకు వస్తాయన్నారు. విద్యాశాఖ మంత్రిగా సాక్షాత్తూ చంద్రబాబు కొడుకు నారా లోకేష్ ఉన్నాడు కాబట్టే, ఈ తప్పులపై విచారణ చేయడానికి చంద్రబాబు ముందుకు రావడం లేదని, పైగా ఎదురుదాడి చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

**నిరుద్యోగులకు వైఎస్ జగన్ భరోసా**
"వారం రోజుల క్రితం డీఎస్సీ అభ్యర్థులంతా నా వద్దకు వచ్చినప్పుడు వారికి ఒక్కటే చెప్పాను. వారి తరఫున న్యాయపోరాటం చేస్తాం. ఒకవేళ ఇప్పటి ప్రభుత్వం న్యాయం చేయకపోతే.. రేపు మేం అధికారంలోకి రాగానే ఒక కమిషన్ వేసి, రీ–వెరిఫై చేసి, అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తాం" అని వైఎస్ జగన్ నిరుద్యోగ యువతకు గట్టి హామీ ఇచ్చారు.

# మస్క్ మావా తో అట్లుంటది మరి.. స్పేస్ ఎక్స్ ఐపీఓ వస్తే 'స్పేస్' లోకి వెళ్లేది రాకెట్లు కాదు.. ఉద్యోగుల...




ఎలాన్ మస్క్ అనగానే మనకు గుర్తొచ్చేవి ఎక్స్ లో ఆయన పెట్టే విచిత్రమైన పోస్ట్ లు.. అంగారకుడిపై ఇళ్లు కడతాడనే ఊహాగానాలు.. లేదా ఎప్పుడు పేలుతుందో తెలియని రాకెట్లు. కానీ ఇప్పుడు అందరి దృష్టి మస్క్ బాబాయ్ మీద లేదు సరికదా.. ఆయన కంపెనీ స్పేస్ ఎక్స్ లో పని చేసే కుర్రాళ్ల మీద పడింది. అవును.. మీరు విన్నది నిజమే.. స్పేస్ ఎక్స్ ఐపీఓ మార్కెట్లోకి రాబోతుందనే వార్తలతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇన్వెస్టర్ల కంటే.. ఆ కంపెనీలో పని చేసే ఉద్యోగులే ఎక్కువ కలల లోకంలో తేలిపోతున్నారు.

**జీతం తక్కువ.. షేర్లు ఎక్కువ.. మస్క్ తాత వేసిన 'మాస్టర్ ప్లాన్'**
సాధారణంగా ఏ స్టార్టప్ కంపెనీలోనైనా ఉద్యోగులను చేర్చుకునేటప్పుడు ఒక డైలాగ్ చెప్తారు. "ఇప్పుడు జీతం కొంచెం తక్కువ ఇస్తాం కానీ.. కంపెనీ షేర్లు ఇస్తాం. భవిష్యత్తులో మీరు కోటీశ్వరులు అయిపోతారు" అని. చాలా కంపెనీల్లో ఈ ముక్క నమ్మి జాయిన్ అయినవాళ్లు ఆ తర్వాత తలలు పట్టుకుంటారు. కానీ మస్క్ దగ్గర ఆ పప్పులు ఉడకలేదు. ఆయన నిజంగానే 'స్పేస్' లెవెల్ ప్లాన్ వేశాడు.
విశ్లేషకుల అంచనాల ప్రకారం.. స్పేస్ ఎక్స్ గనుక షేర్ మార్కెట్‌లో అడుగుపెడితే.. సుమారు 4,000 నుండి 4,400 మంది ప్రస్తుత, మాజీ ఉద్యోగులు రాత్రికి రాత్రే మిలియనీర్లు అయిపోతారట..ట్విస్ట్ ఏంటంటే ఇందులో కేవలం పెద్ద పెద్ద రాకెట్ సైంటిస్టులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మాత్రమే లేరు. కంపెనీ క్యాంటీన్‌లో కాఫీలు ఇచ్చిన సిబ్బంది, రాకెట్ ముక్కలను అతికించిన వెల్డర్లు, ఆఫీస్ బాయ్స్ కూడా ఉన్నారు. రేపు పొద్దున వీళ్లంతా రోల్స్ రాయిస్ కార్లలో ఆఫీస్‌కి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కార్పొరేట్ ప్రపంచంలో ఒక అన్ ప్రిడక్టబుల్ నియమం ఉంది. కంపెనీ ఎంత లాభాల్లోకి వచ్చినా.. సింహభాగం అంతా పైన కూర్చున్న సీఈఓలు, మేనేజర్ల అకౌంట్లలోకి వెళ్తుంది. కింద ఉన్న ఉద్యోగులకు మాత్రం "ఈసారి దీపావళికి స్వీట్ బాక్స్ కొంచెం పెద్దది ఇస్తున్నాం" అనే బోనస్ డైలాగ్స్ మిగులుతాయి.
కానీ స్పేస్ ఎక్స్ కథ వేరు. రాకెట్లు భూమి మీద పడి పేలిపోతున్నప్పుడు కూడా మస్క్‌ను నమ్మి, జీతాలు తక్కువైనా షేర్లను నమ్ముకుని పనిచేసినందుకు.. ఇప్పుడు వాళ్ల అకౌంట్లు 'టపాసులు' పేల్చబోతున్నాయి. దీన్నే కొందరు మేధావులు "ఉద్యోగుల సంపద పండుగ" అంటున్నారు.

**అంతా బాగానే ఉంది కానీ.. ఆ మస్క్ మామ నోరు విప్పాలిగా?**
మార్కెట్ అంతా ఇంతలా ఊగిపోతుంటే మన ఎలాన్ మస్క్ మాత్రం ఏమీ తెలియనట్టు సైలెంట్‌గా ఉన్నాడు. ఎప్పుడు ఏ మూడ్‌లో ఉంటాడో తెలియని మస్క్ ఐపీఓ గురించి ఇంకా అధికారికంగా నోరు మెదపలేదు. బహుశా ఎక్స్ లో ఏదైనా మీమ్ పోస్ట్ చేసి సర్ప్రైజ్ ఇద్దామని ప్లాన్ చేస్తున్నాడేమో.. ఒకవేళ ఈ ఐపీఓ కనుక వస్తే.. అది ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద లిస్టింగ్‌లలో ఒకటిగా నిలవడం ఖాయం.
స్పేస్ ఎక్స్ కథలో అసలు హీరో ఎలాన్ మస్క్ మాత్రమే కాదు.. "మస్క్ గారు ఏ క్షణంలోనైనా కంపెనీని మూసేయవచ్చు లేదా మార్స్ కి తీసుకెళ్లవచ్చు" అనే భయం ఉన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పని చేసిన వేలాది మంది ఉద్యోగులు. రాకెట్లను అంతరిక్షంలోకి పంపిన వాళ్ల చేతులు త్వరలోనే నోట్ల కట్టలను లెక్కపెట్టబోతున్నాయి. కాబట్టి ఫ్రెండ్స్.. నెక్స్ట్ టైం ఎవరైనా మస్క్ కంపెనీలో 'స్వీపర్' ఉద్యోగం ఉన్నా వదులుకోవద్దు. ఎందుకంటే.. మస్క్ తో అట్లుంటది మరి..

# ఫుడ్, ఈ కామర్స్, OTT పేమెంట్స్ పై వీసా డెబిట్, క్రెడిట్ కార్డు భారీ ఆఫర్స్..




రూపాయి నుంచి లక్షల రూపాయల వరకు పేమెంట్ ఏదైనా ఇప్పుడు కార్డు ద్వారానే.. దేశంలో డిజిటల్ పేమెంట్స్ ప్రతి నెలా రికార్డ్ స్థాయిలో పెరుగుతున్నాయి. దీన్ని గమనించిన డెబిట్, క్రెడిట్ కార్డు కంపెనీలు భారీ ఆఫర్స్ ప్రకటిస్తున్నాయి. లేటెస్ట్ గా వీసా క్రెడిట్, డెబిట్ కార్డు సంస్థ భారీ ఒప్పందాలు చేసుకున్నది. వీసా ప్లాటినం, క్లాసిక్ కార్డులపై భారీ ఆఫర్స్ ప్రకటించింది.

ఫుడ్ అండ్ గ్రాసరీ డెలివరీ సంస్థలు అయిన స్విగ్గీ, జెప్టోలతోపాటు మీషో, ఇన్ స్టామార్ట్ వంటి సంస్థలతో భారీ ఒప్పందం చేసుకుంది. అదే విధంగా అబి బస్ తో డీల్ చేసుకుంది. అబి బస్ లో టికెట్ బుకింగ్ కు వీసా కార్డు ఉపయోగించినట్లయితే 200 రూపాయలు డిస్కౌంట్ ప్రకటించింది. ఇక లైఫ్ స్టయిల్, షాపర్స్ స్టాప్, మ్యాక్స్, లూలూ మాల్, మోర్ సూపర్ మార్కెట్స్, స్టార్ బజార్ వంటి రిటైల్ సూపర్ మార్కెట్లలో వీసా కార్డు చెల్లింపులపై భారీ ఆఫర్స్ ప్రకటించింది వీసా. షాపర్స్ స్టాప్ లో షాపింగ్ చేసి.. వీసా కార్డు ద్వారా చెల్లింపులు చేసినట్లయితే వెయ్యి రూపాయల వరకు డిస్కౌంట్ ప్రకటించింది. ఇంకా ప్లాట్ ఫామ్స్ విభాగంలోనూ ఆఫర్స్ ప్రకటించింది వీసా. సోనీలివ్, జీ 5 ఓటీటీలకు వీసా డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ చేసినట్లయితే రెడిమ్ పాయింట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది వీసా. వీసా క్రెడిట్ కార్డు తీసుకునే కొత్త కస్టమర్లకు వెలకమ్ ఓచర్ కింద 250 రూపాయలు ఇవ్వటంతోపాటు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల్లో ఉచితంగా లాంజ్ యాక్సెస్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.

ప్రస్తుతం దేశంలో ఉన్న 29 కోట్ల మంది వీసా డెబిట్, క్రెడిట్ కార్డు కస్టమర్లకు ఈ ప్రయోజనాలు అన్నీ అందుతాయని స్పష్టం చేసిన వీసా.. కన్స్యూమర్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సంస్థలతో కొత్తగా చేసుకున్న ఒప్పందాల ద్వారా కస్టమర్లు అందరూ తమ రోజువారీ ప్రయోజనాలు పొందగలరని స్పష్టం చేసింది వీసా.

# ఐఫోన్ ప్రియులకు శుభవార్త.. ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై భారీ డిస్కౌంట్

**రిలయన్స్ డిజిటల్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై భారీ డిస్కౌంట్**

**ఫ్లాట్ డిస్కౌంట్, బ్యాంక్ ఆఫర్లతో కలిపి రూ.11,508 వరకు తగ్గింపు**

**ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ కార్డులపై అదనపు క్యాష్‌బ్యాక్**

**అన్ని ఆఫర్ల తర్వాత రూ.1,38,392కే ఫోన్**



ఆపిల్ నుంచి వచ్చిన లేటెస్ట్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైల్ సంస్థ రిలయన్స్ డిజిటల్ ఒక అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఫ్లాట్ డిస్కౌంట్, బ్యాంక్ ఆఫర్లను కలుపుకొని ఈ ఫోన్‌పై ఏకంగా రూ.11,508 వరకు తగ్గింపును అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఇతర ఆన్‌లైన్ వేదికలతో పోలిస్తే ఇదే అతిపెద్ద ఆఫర్‌గా నిలుస్తోంది.

**ఆఫర్ వివరాలు ఇవే..**

భారత మార్కెట్లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (256+దీ) వేరియంట్ అసలు ధర రూ.1,49,900గా ఉంది. రిలయన్స్ డిజిటల్ తన ఆన్‌లైన్ స్టోర్‌లో దీనిపై నేరుగా రూ.4,910 తక్షణ తగ్గింపును అందిస్తూ రూ.1,44,990కే జాబితా చేసింది. దీనికి అదనంగా, ఎంపిక చేసిన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే రూ.6,598 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. దీంతో అన్ని ఆఫర్లు పోగా, ఈ ఫోన్ తుది ధర రూ.1,38,392కే అందుబాటులోకి వస్తుంది.

**కొనాలా?.. ఆగాలా?**

ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ అత్యాధునిక ఏ19 ప్రో చిప్‌సెట్, వేడెక్కకుండా నిరోధించే వేపర్ ఛాంబర్ కూలింగ్ సిస్టమ్, 48 మెగాపిక్సెల్ ట్రిపుల్ కెమెరా సెటప్ వంటి శక్తిమంతమైన ఫీచర్లతో వస్తోంది. అయితే, మరికొన్ని నెలల్లో ఆపిల్ నుంచి ఐఫోన్ 18 సిరీస్ విడుదల కానుంది. ఇందులో మరింత శక్తివంతమైన ఏ20 ప్రో చిప్, పెద్ద బ్యాటరీ, మెరుగైన కెమెరా వంటి అప్‌గ్రేడ్లు ఉండే అవకాశం ఉందని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సాధారణంగా కొత్త మోడల్ వచ్చిన తర్వాత పాత మోడళ్ల ధరలు అధికారికంగా తగ్గుతాయి. ఈ నేపథ్యంలో, తక్షణమే ఒక ప్రీమియం ఫోన్ కొనాలనుకునే వారికి రిలయన్స్ డిజిటల్ అందిస్తున్న ఈ డీల్ ఒక మంచి ఎంపికగా చెప్పవచ్చు. లేదంటే, ఐఫోన్ 18 సిరీస్ విడుదల లేదా పండుగ సీజన్ సేల్స్ వరకు వేచి చూడటం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

# రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా చేసుకుంటే బెటర్!

**రిటైర్మెంట్ ప్లానింగ్‌ను ఆలస్యం చేయడం అతిపెద్ద పొరపాటు**

**ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకోకపోతే భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు**

**ఒకేచోట పెట్టుబడి పెట్టకుండా వైవిధ్యం పాటించడం ముఖ్యం**

**పెరుగుతున్న వైద్య ఖర్చుల కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసుకోవాలి**

**ప్రతి ఏటా ఆర్థిక ప్రణాళికను సమీక్షించుకోవడం తప్పనిసరి**

పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వైద్య ఖర్చుల నేపథ్యంలో చాలామందికి పదవీ విరమణ (రిటైర్మెంట్) అనంతరం ఆర్థిక భద్రత ఒక పెద్ద సవాలుగా మారుతోంది. రిటైర్మెంట్ ప్లానింగ్‌లో చేసే కొన్ని సాధారణ పొరపాట్లు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులకు దారితీస్తాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తుగా అప్రమత్తమై, సరైన ప్రణాళికతో ముందుకు సాగితేనే సురక్షితమైన పదవీ విరమణ జీవితం సాధ్యమవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.

ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, రిటైర్మెంట్ ప్లానింగ్‌ను వాయిదా వేయడం చాలామంది చేసే అతిపెద్ద తప్పు. సంపాదించడానికి ఇంకా చాలా సమయం ఉందని భావించడం వల్ల 'కాంపౌండింగ్' ద్వారా లభించే ప్రయోజనాన్ని కోల్పోతారు. ఎంత త్వరగా పెట్టుబడులు ప్రారంభిస్తే, అంత ఎక్కువ రాబడిని పొందే అవకాశం ఉంటుంది. మరో ప్రధానమైన పొరపాటు ద్రవ్యోల్బణాన్ని విస్మరించడం. ప్రస్తుత కాలంలో కోటి రూపాయలు భారీ మొత్తంగా కనిపించినప్పటికీ, మరో 15-20 ఏళ్ల తర్వాత ద్రవ్యోల్బణం కారణంగా దాని విలువ గణనీయంగా తగ్గుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

అలాగే, కేవలం ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా చిన్న మొత్తాల పొదుపు పథకాల వంటి ఏదో ఒకే రకమైన పెట్టుబడిపైనే ఆధారపడటం ప్రమాదకరం. వయసు, రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని బట్టి పెట్టుబడులలో వైవిధ్యం పాటించాలి. వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఆరోగ్య అవసరాల కోసం ప్రత్యేకంగా ఒక నిధిని కేటాయించుకోవడంతో పాటు, తగిన ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడం తప్పనిసరి. వీటితో పాటు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఏటా తమ ఆర్థిక ప్రణాళికను సమీక్షించుకోవాలి.




రూపే112 బిజినెస్ హెడ్ కుల్దీప్ యదువంశీ మాట్లాడుతూ, "త్వరగా పెట్టుబడులు ప్రారంభించడం, క్రమం తప్పకుండా పొదుపు చేయడం, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం ద్వారానే రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. ఈ పొరపాట్లను సరిదిద్దుకొని, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికను అనుసరిస్తే పదవీ విరమణ జీవితాన్ని హాయిగా గడపవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## చదువు కోసం భారత్‌కు వచ్చి... రూ.190 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన అమెరికన్

**భారత్‌లో అమెరికన్ వ్యాపారవేత్త బెర్ట్ ముల్లర్ విజయం**

**'కాలిఫోర్నియా బురిటో' పేరుతో 103 రెస్టారెంట్లు**

**2024లో 23 మిలియన్ డాలర్ల ఆదాయం**

**చదువు కోసం వచ్చి వ్యాపారవేత్తగా మారిన వైనం**

**స్థానిక రుచులకు అనుగుణంగా మెక్సికన్ వంటకాల తయారీ**




చదువు కోసం భారత్‌కు వచ్చిన ఓ అమెరికన్ యువకుడు, ఇక్కడే ఏకంగా రూ.190 కోట్ల విలువైన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. కేవలం 22 ఏళ్ల వయసులో భారత్‌కు వచ్చిన బెర్ట్ ముల్లర్, దశాబ్ద కాలంలోనే దేశంలోని అతిపెద్ద మెక్సికన్ రెస్టారెంట్ చెయిన్‌లలో ఒకటైన 'కాలిఫోర్నియా బురిటో'ను స్థాపించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 103 అవుట్‌లెట్లతో విస్తరించిన ఈ సంస్థ, 2024 ఆర్థిక సంవత్సరంలో 23 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.190 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. 2010లో, 22 ఏళ్ల బెర్ట్ ముల్లర్ అమెరికా నుంచి జైపూర్‌కు ఒక స్టడీ ప్రోగ్రామ్‌లో భాగంగా వచ్చాడు. ఇక్కడ ఒక ఆతిథ్య కుటుంబంతో కలిసి నివసిస్తున్నప్పుడు, తాను వండిన అమెరికన్ వంటకాల కన్నా మెక్సికన్ మూలాలున్న తన క్లాస్‌మేట్ చేసిన వంటకాలను వారు ఎక్కువగా ఇష్టపడటాన్ని గమనించాడు. అదే అతడిలో వ్యాపార ఆలోచనకు బీజం వేసింది. వారు మెక్సికన్ వంటకాలైన చిప్స్, సల్సా, బీన్స్ వంటి వాటిని ఎంతో ఇష్టంగా తినడాన్ని ఆయన గమనించారు. భారత్‌లో మెక్సికన్ ఫుడ్‌కు మంచి ఆదరణ ఉంటుందని నమ్మారు. "భారత్‌కు మెక్సికన్ తరహా ఆహార సంస్కృతిని పరిచయం చేయవచ్చనే ఆలోచన ఆ రోజే నాలో మొలకెత్తింది" అని ముల్లర్ తన గతాన్ని గుర్తుచేసుకున్నారు. 2011లో అమెరికాలో చదువు పూర్తయిన తర్వాత తన ఇద్దరు స్నేహితులతో కలిసి భారత్‌కు తిరిగి వచ్చిన ముల్లర్, కుటుంబ సభ్యులు మరియు స్నేహితుల నుంచి సుమారు 2,50,000 డాలర్ల నిధులను సమీకరించారు. అనంతరం 2012లో బెంగళూరులో మొట్టమొదటి 'కాలిఫోర్నియా బురిటో' అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. విదేశీ ప్రయాణాలు చేసే టెక్ నిపుణులు బెంగళూరులో అధికంగా ఉండటం, ఆయన వ్యాపార విస్తరణకు సరైన వేదికగా నిలిచింది. అయితే, ఈ విజయ ప్రయాణంలో ఆయనకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఒక సీనియర్ ఉద్యోగి అక్రమాలకు పాల్పడటం, సరఫరాదారులు అధిక ధరలు వసూలు చేయడం వంటి సమస్యలు తలెత్తాయి. అంతేకాకుండా, అవకాడో పండ్ల సాగులో వాతావరణ పరిస్థితులు, వన్యప్రాణుల బెడద వంటి ఇబ్బందులను కూడా ఆయన ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ముల్లర్ ఎక్కడా వెనకడుగు వేయలేదు. "మా అమ్మ ఒక మారథాన్ రన్నర్, ఆ పట్టుదల నాలోనూ ఉంది. లక్ష్యాన్ని చేరే వరకు నిరంతరం శ్రమించాలి. వ్యాపారాన్ని వదిలేయాలనే ఆలోచన నాకు ఎప్పుడూ రాలేదు" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 35 ఏళ్ల వయస్సున్న ముల్లర్ పూర్తిగా భారత్‌లోనే స్థిరపడ్డారు. స్థానిక రైతుల నుంచి ముడిసరుకులను సేకరించడంతో పాటు, స్వయంగా వందలాది అవకాడో చెట్లను నాటారు. "నేను భారత్‌ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. ఇండియా ఇప్పుడు నా సొంత ఇల్లులా మారిపోయింది" అని ముల్లర్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## భారత్‌కు ఓపెన్‌డోర్ బై-బై: చెన్నై, బెంగళూరు ఆఫీసులు బంద్.. 250 మంది లేఆఫ్




అమెరికాకు చెందిన ప్రముఖ ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ దిగ్గజం 'ఓపెన్‌డోర్' భారత్‌లో తన వ్యాపారాన్ని క్లోజ్ చేసింది. భారతదేశంలో తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల దేశంలోని చెన్నై, బెంగళూరు ఆఫీసుల్లో పనిచేస్తున్న దాదాపు 250 మంది ఉద్యోగులు రాత్రికి రాత్రే రోడ్డున పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా టెక్, రియల్ ఎస్టేట్ రంగాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఖర్చులు తగ్గించుకునేందుకే..**

ఓపెన్‌డోర్ అనేది ప్రధానంగా అమెరికాలో ఇళ్లను ఆన్‌లైన్ ద్వారా నేరుగా కొనుగోలు చేసి, వాటిని తిరిగి విక్రయించే వ్యాపార నమూనాను నడుపుతోంది. అయితే భారత దేశంలోని ఆఫీసుల ద్వారా కంపెనీకి అవసరమైన టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, బ్యాక్-ఎండ్ సపోర్ట్ సేవలను ఇక్కడి ఉద్యోగులు అందించేవారు. అంతర్జాతీయ మార్కెట్లో మారుతున్న ఆర్థిక పరిస్థితులు, నిధుల కొరత, ఖర్చుల మదింపులో భాగంగానే భారత్‌లోని ఆపరేషన్లను పూర్తిగా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించింది.

**ఉద్యోగులకు షాక్.. ప్యాకేజీలతో వీడ్కోలు**

కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే లేఆఫ్స్‌కు గురైన ఉద్యోగులను ఆదుకునేందుకు కంపెనీ కొంతవరకు సెవెరెన్స్ ప్యాకేజీలను, అలాగే కొత్త ఉద్యోగ అవకాశాలను వెతుక్కునేందుకు అవసరమైన కెరీర్ సపోర్ట్‌ను అందిస్తున్నట్లు సమాచారం. గ్లోబల్ టెక్ కంపెనీలు రీస్ట్రక్చరింగ్ పేరిట చేస్తున్న ఉద్యోగాల కోత ఇప్పట్లో ఆగేలా లేదని తాజా పరిణామం మరోసారి నిరూపించింది. ఇండియా ఆపరేషన్స్ క్లోజ్ చేసిన ఓపెన్‌డోర్.. ఇకపై పూర్తి స్థాయిలో తన అమెరికా మార్కెట్‌పైనే దృష్టి పెట్టనుందట.



# మానసిక ఆరోగ్యం సరిగా లేకపోతే గుండెపోటు వస్తుందా?

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండె సమస్యలకు కొత్త ప్రధాన ప్రమాద కారకంగా మారుతున్నాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం వంటివి ఇప్పటికే గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కానీ, నిపుణులు ఇప్పుడు ఒత్తిడి, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు కూడా గుండెను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. డిప్రెషన్, ఆందోళన 50 శాతం గుండె సమస్యలను పెంచుతాయని ఆరోగ్య నిపుణులు షాకింగ్ విషయాలు వెల్లడించారు.

**మానసిక ఒత్తిడి గుండెను ఎలా ప్రభావితం చేస్తుంది?**

మనం దీర్ఘకాలిక ఒత్తిడి లేదా ఆందోళనలో ఉన్నప్పుడు, శరీరం కార్టిసాల్, కాటెకోలమైన్‌లు వంటి ఎక్కువ హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మిటర్‌లను (ఉదాహరణకు, అడ్రినలిన్) ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్లు హృదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతాయి.

**గుండెపై ఒత్తిడి ప్రమాదాలు**

మానసిక ఒత్తిడి గుండెను నేరుగా ప్రభావితం చేయడమే కాకుండా, దాని ఇతర దుష్ప్రభావాలు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ఒత్తిడికి గురైనప్పుడు, వారు తరచుగా ఒకే చోట పడుకున్నట్లు లేదా కూర్చున్నట్లు భావిస్తారు. ఒత్తిడికి గురైన వ్యక్తులు తక్కువ చురుగ్గా ఉంటారు. వ్యాయామంపై కూడా దృష్టి పెట్టరు. ఎక్కువసేపు ఒత్తిడి ఉండటం లేదా శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె కండరాలపై ఒత్తిడి పెరిగి అవి బలహీనపడతాయి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

**అనారోగ్యకరమైన ఆహారం**

చాలా మంది ఒత్తిడిలో జంక్ ఫుడ్, వేయించిన ఆహారాలు, స్వీట్లు ఎక్కువగా తింటారు. ఈ ఆహారాలు బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తీవ్రతరం చేస్తాయి, ఇది రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. గుండెను బలహీనపరుస్తుంది.

**నిద్రలేమి**

ఒత్తిడి, ఆందోళన నిద్రలేమికి దారితీయవచ్చు. దీని వలన రక్తపోటు పెరుగుతుంది. ఇది నేరుగా గుండెపై ప్రభావం చూపుతుంది. నిద్ర లేకపోవడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

**మందులు తీసుకోకపోవడం**

రక్తపోటు లేదా మధుమేహం వంటి సమస్యలకు ఇప్పటికే మందులు తీసుకుంటున్న వారు, ఒత్తిడి కారణంగా మందులు వేసుకోకుండా ఇబ్బంది పడుతుంటారు. తరచుగా వారు మందులు సకాలంలో తీసుకోవడం మర్చిపోతారు. దీనివల్ల వ్యాధి అదుపు తప్పి తీవ్రమైన గుండె సమస్యలకు దారితీస్తుంది.



# వినికిడి లోపిస్తే



వినికిడి పరికరం వాడకాన్ని చిన్నతనంగా భావించి దాని జోలికి వెళ్లని వాళ్లుంటారు. వినికిడి లోపం ఉన్నా ఆ విషయాన్ని ఒప్పుకోడానికి తటపటాయించే వాళ్లుంటారు. 'వినికిడి పూర్తిగా పోయినప్పుడు ఆలోచిద్దాంలే!' అనుకుంటూ హియరింగ్ ఎయిడ్స్ వాడకానికి దూరంగా ఉండిపోయే వాళ్లుంటారు. కానీ వీటిని వాడకపోవడం వల్ల, దాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం క్రమేపీ తగ్గిపోయి, వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు

వైద్యులు వినికిడి లోపం జీవితంలో ఎప్పుడైనా తలెత్తవచ్చు. పుట్టుకతోనే ఈ లోపం ఉండొచ్చు. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు, కొన్ని రకాల మందులు, పైబడే వయసు, పెద్ద శబ్దాలకు బహిర్గతమవడం వల్ల కూడా వినికిడి లోపం తలెత్తవచ్చు.

వృద్ధాప్యం: పైబడే వయసులో కంటిచూపు తగ్గినట్టే, 50 ఏళ్లు పైబడిన తర్వాత వినికిడి శక్తి కూడా తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. అయితే, సాధారణంగా వినికిడి శక్తి తగ్గడం మొదలుపెట్టినప్పుడు పైబడే వయసులో ఇదంతా మామూలే అనుకుంటూ హియరింగ్ ఎయిడ్ వాడకాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ హియరింగ్ ఎయిడ్ వాడకంతో కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తీసుకురాలేకపోయినప్పటికీ, వినికిడి పరికరాన్ని ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది. కాబట్టి సమస్యను గుర్తించిన వెంటనే హియరింగ్ ఎయిడ్‌ను వాడుకోవడం మొదలుపెట్టాలి. మరీ ముఖ్యంగా వినికిడి శక్తి లోపించడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతిని, నలుగురిలో కలవలేక, మానసిక కుంగుబాటుకు లోనై, ఒంటరిగా గదికే పరిమితమైపోతూ ఉంటారు. దాంతో జీవన నాణ్యత కూడా దెబ్బ తింటుంది. కాబట్టి ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు.

పుట్టుకతోనే: పుట్టుకతోనే సంక్రమించే జన్యుపరమైన వ్యాధుల్లో వినికిడి లోపం కూడా ఒకటి. మేనరికం వివాహాల్లో పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సహజం.

వ్యాధులు: మలేరియా, టైఫాయిడ్ లాంటి వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వినికిడికి సంబంధించిన నాడిని దెబ్బతీస్తాయి.

మందులు: జెంటామైసిన్, అమికాసిన్ లాంటి ఆటోటాక్సిక్ మందులు, కీమోథెరపీ మందులు, మలేరియా మందుల వాడకం వల్ల కూడా లోపలి చెవి దెబ్బతిని వినికిడి శక్తి తగ్గవచ్చు.

**పిల్లల్లో వినికిడి లోపం**

మేనరికం వివాహాల వల్ల లేదా ఇతరత్రా జన్యు సమస్యల వల్ల కొందరు పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను వెంట తెచ్చుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో పసికందులు శబ్దాలకు స్పందించడం లేదని గ్రహించిన వెంటనే 'బేరా' (బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ పరీక్ష చేయించాలి. ఈ పరీక్షతో పసికందుల వినికిడి లోపం ఏ మేరకు ఉందన్నది తెలుస్తుంది. అలాగే పది నెలలు దాటిన పిల్లలు చప్పుళ్లకు స్పందించకపోయినా, ఈ పిల్లలకు మాటలు రాకపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. ఏడాది లోపున్న పసిపిల్లల్లో వినికిడి శక్తి లోపిస్తే, కోక్లియర్ ఇంప్లాంట్ అమర్చవలసి ఉంటుంది. దీంతో వినికిడి శక్తి పెరిగి పిల్లల ఎదుగుదల ఆరోగ్యకరంగా సాగుతుంది. ఈ ఇంప్లాంట్‌ను అమర్చడం కోసం వైద్యులు పుర్రె లోపల వినికిడి నాడికి ఎలక్ట్రోడ్స్‌ను అనుసంధానించి, కోక్లియాను అమరుస్తారు. చెవి దగ్గర బహిర్గతమయ్యే విడి భాగంలో అవసరాన్ని బట్టి బ్యాటరీలను మార్చుకుంటూ పిల్లలు జీవితకాలం పాటు ఈ వినికిడి పరికరాన్ని వాడుకోవచ్చు.

**ఇది తాత్కాలికమే!**

వానాకాలంలో సాధారణ జలుబులతో తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. సాధారణంగా ఇది పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. అలాగే అలర్జీల వల్ల, చలికి బహిర్గతమవడం వల్ల, జలాంతర క్రీడల వల్ల, విమానం నేల మీదకు దిగేటప్పుడు కర్ణభేరి మీద ఒత్తిడి పెరిగి, చెవి పోటు, తాత్కాలిక వినికిడి లోపం తలెత్తవచ్చు. విమానం కిందకు దిగే సమయంలో చెవి పోటు, దిబ్బెడ వేధించే సమస్య ఉన్నవాళ్లు ప్రయాణానికి ముందు ఆవిరి పట్టుకోవాలి. అలాగే విమానం దిగడానికి అరగంట ముందు యాంటీ హిస్టమిన్ మాత్ర వేసుకోవాలి. అలాగే అలర్జీలు, జలుబులకు చికిత్స తీసుకోవాలి. వీటితో తాత్కాలిక వినికిడి లోపం తగ్గిపోతుంది. పబ్‌లు, డిజెల్లోని బిగ్గర శబ్దాలకు బహిర్గతమైన తర్వాత చెవిలో గుయ్యిమనే శబ్దంతో పాటు వినికిడి తగ్గితే వెంటనే వైద్యులను కలిసి చెవి ఇంజక్షన్లు తీసుకోవాలి. లేదంటే కోల్పోయిన వినికిడి శక్తి తిరిగొచ్చే వీలుండదు. ఇలా జరగకుండా ఉండాలంటే, బిగ్గర శబ్దాలతో కూడిన ప్రదేశాలను సందర్శించేటప్పుడు, స్పీకర్లకు దూరంగా ఉంటూ, ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అలాగే దీపావళి నాడు టపాసులు కాల్చే సమయంలో కూడా ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి. అయితే అప్పటికే చెవి సమస్యలతో బాధపడుతున్న వాళ్లు టపాసుల శబ్దాలకు ఏమాత్రం బహిర్గతం కాకుండా, గదులకే పరిమితం కావాలి.

**అకస్మాత్తుగా వినికిడి కోల్పోతే...**

కారణం ఏదైనా అకస్మాత్తుగా వినికిడి శక్తి కోల్పోతే, తిరిగి వచ్చేస్తుందిలే అని తాత్సారం చేయడం సరికాదు. ఇలాంటి సందర్భాల్లో ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే, వినికిడి శక్తి అంత త్వరగా తిరిగొస్తుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రతించగలిగితే, చెవిలోకి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి తెప్పించవచ్చు.

# హై బీపీ సమస్య ఇబ్బంది పెడుతోందా?.. జస్ట్ ఈ సింపుల్ చిట్కాలు..

ప్రస్తుతం హై బీపీ సమస్య అందరిని ఇబ్బంది పెడుతోంది. వైద్యులు వద్దకు వెళ్లితే.. భారీగా ఫీజు వసూల్ చేస్తున్నారు. దీనితోపాటు అత్యంత ఖరీదైన మందులు రాస్తున్నారు. దీంతో జేబుకు చిల్లు.. అది కూడా గట్టిగా పడుతుంది. అయితే ఇంట్లోనే మనం తినే.. తీసుకునే ఆహారంలో కొద్ది పాటు మార్పులు చేర్పులతో ఈ హై బీపీ సమస్యను దాదాపుగా నియంత్రించువచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అందుకు ఆరు చక్కటి పరిష్కారాలను వారు సోదాహరణగా వివరిస్తున్నారు.



మొదటిది.. కీర దోసకాయ.. బీపీని నియంత్రించడానికి ఇది చాలా బాగా పని చేస్తుంది. కేజీ కీర దోసకాయ ఖరీదు చాలా స్వల్పంగానే ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. వీటిని రోజు తీసుకోవడం ద్వారా సులభంగా హై బీపీని నియంత్రివచ్చు.

రెండోవది.. రాతి ఉసిరి (ఆమ్లా).. ఇందులో ఎన్నో పోషకాలతోపాటు విటమిన్లు సైతం ఉంటాయి. ఇది సహజ సిద్ధంగా లభిస్తుంది. అంతేకాకుండా దీని వల్ల అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ఇది శరీరాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. అంటే శరీరంలోని విషాన్ని పూర్తిగా తొలగించే శక్తి.. ఈ రాతి ఉసిరికి ఉంది. ఈ రాతి ఉసిరి.. షుగర్, హై బీపీలను తగ్గించడమే కాకుండా బరువు తగ్గడంలో సైతం కీలకంగా వ్యవహరిస్తోంది.


మూడోవది అన్ని కూరగాయలు.. మరి మఖ్యంగా బెల్ పెప్పర్స్ (సిమ్లా మిర్చి). ఇందులో రంగులు ఉంటాయి. అంటే పసుపు, ఎరుపు, పచ్చని క్యాప్సికమ్ మిర్చి లభిస్తుంది. ఏ రంగులో ఉన్న ఈ మిర్చి తీసుకున్నా.. బీపీ మాత్రం నియంత్రణలోకి వస్తుంది. అలాగే క్యారెట్ సైతం బీపీ తగ్గడానికి సహాయపడుతుంది.

నాలుగోది.. ముల్లంగి (ర్యాడిష్) ఇది కొద్దిగా ఘాటుగా ఉంటుంది. అందుకే దీనిని తినడానికి ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ దీనిని కూరగా చేసుకుని తీసుకుంటే మాత్రం చాలా మంచిది.

ఐదోవది.. మజ్జిగ (బటర్ మిల్క్): చాలా పల్చగా చేసుకుని మజ్జిగ తాగాలి. అందులో కొద్దిగా జీలకర్ర పొడితోపాటు సొంపు పొడి వేసుకుని తీసుకుంటే వెంటనే రిలీఫ్ ఉంటుంది. పేగులు సైతం ఆరోగ్యంగా ఉంటాయి.

ఆరోవది.. రాత్రి సమయంలో గ్లాస్ వాటర్ తీసుకోవాలి. టీ స్పూన్ సొంపు, జీలకర్ర, ఒక దాల్చిన చెక్కను నీటిలో వేసి నానబెట్టాలి. ఉదయం అందులో పొదీనా వేయాలి. ఈ మిశ్రమంలో ఆఫ్ టీ స్పూన్ ములగాకు పొడి కూడా వేసి బాగా మరిగించాలి. అనంతరం వడ పోసుకుని.. అందులో నిమ్మకాయ పిండుకుని తాగితే.. బీపీ వెంటనే కంట్రోల్ అవుతుంది. ఇది క్రమం తప్పకుండా ప్రతి రోజు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

# సోరియాసిస్‌కు సమర్థమైన వైద్యం



తిరగబెడుతూ వేధించే చర్మ వ్యాధుల్లో సోరియాసిస్ ఒకటి. అయితే శరీర తత్వం, ప్రేరేపించే అంశాలు, మందుల ప్రభావాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ మొండి సమస్యను కూడా పరిష్కరించుకోవచ్చు. ఎలాగో తెలుసుకుందాం!

సోరియాసిసకు ఫలానా కారణమని కచ్చితంగా చెప్పడానికి వీల్లేదు. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల, రక్షణ వ్యవస్థ శరీరం మీదే దాడి చేసే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా సోరియాసిస్ తలెత్తవచ్చు. వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. అయితే ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడితో కూడిన జీవితం, కొన్ని రకాల ఆహార పదార్థాల వల్ల సోరియాసిస్ తలెత్తవచ్చని కొన్ని తాజా అధ్యయనాల్లో తేలింది. కొన్ని సందర్భాల్లో చర్మ గాయాలు మానిన తర్వాత, ఆ ప్రదేశంలో సోరియాసిస్ తలెత్తుతూ ఉంటుంది. దీన్ని 'కోబ్నర్ ఫెనొమినా' అంటారు. అలాగే కొన్ని రకాల మందులు, స్టిరాయిడ్స్ కూడా సోరియాసిసను ప్రేరేపిస్తాయి.

**ప్రధాన లక్షణాలు ఇవే!**

దురద చర్మంపై పగుళ్లు, పొట్టు ఏర్పడడం

పొట్టులా ఏర్పడిన ప్రదేశం చుట్టూరా మంట

గోకినప్పుడు పొట్టు రాలడం రకాలున్నాయి సోరియాసిసలో ఐదు రకాలున్నాయి.

**అవేంటంటే...**

ఫ్లేక్ సోరియాసిస్: 80% సోరియాసిసలు ఈ కోవకు చెందినవే! ఈ సమస్య పెద్దల్లో ఎక్కువ.

గుట్టేట్ సోరియాసిస్: పిల్లలు, యుక్తవయస్కుల్లో తలెత్తుతుంది.

ఇన్వర్స్ సోరియాసిస్: స్థూలకాయుల్లో, చర్మపు ముడతల్లో వస్తుంది.

పస్ట్యులార్ సోరియాసిస్: అరుదుగా పెద్దల్లో వస్తుంది.

ఎరిత్రోడెర్మిక్ సోరియాసిస్: 90% చర్మం సోరియాసిసకు గురైనప్పుడు ఎరిత్రోడెర్మిక్ సోరియాసిసగా పరిగణించాలి.

**శాశ్వత చికిత్స లేదు**

సోరియాసిస్ చికిత్సతో అదుపులోకొచ్చి, పూర్తిగా నయమైపోయిన భ్రమను కలిగిస్తుంది. కొన్ని నెలలు, సంవత్సరాల పాటు కనుమరుగైపోయే ఈ సమస్య, అకస్మాత్తుగా తిరబెడుతూ ఉంటుంది. కాబట్టి సోరియాసిసకు శాశ్వత చికిత్స లేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అయితే ఈ వ్యాధిని అదుపులో పెట్టగలిగే సమర్థమైన చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షణాలు, శరీరంలో సోరియాసిస్ తలెత్తిన ప్రదేశం, మందులకు స్పందించే శరీర తత్వం, సమస్యను ప్రేరేపించే కారకాల ఆధారంగా చికిత్సను ఎంచుకోగలిగితే, ఈ చర్మ సమస్యకు వీలైనంతవరకూ అడ్డుకట్ట వేయవచ్చు. మరీ ముఖ్యంగా హోమియోపతిలో సోరియాసిసకు రెండు రకాల చికిత్సలను అనుసరిస్తారు. చర్మపు దురద ఏ ఏ సందర్భాల్లో తలెత్తుతోంది, ఎప్పుడు పెరుగుతోంది? అనే అంశాల ఆధారంగా అందించే చికిత్స ఒకటైతే, సోరియాసిస్ ప్యాచెసతో పాటు శరీర ఉష్ణోగ్రత, ఆహారపుటలవాట్లు, శరీరం మీద వాతావరణ ప్రభావాలు, మానసిక లక్షణాల ఆధారంగా అందించే చికిత్స రెండవది.

**నివారణ ఇలా...**

పొట్ట, ఛాతీ, తల, గోళ్లు, వేళ్ల మధ్య, పిరుదుల మధ్య, తొడల మధ్య మొట్టమొదటిగా సోరియాసిస్ తలెత్తుతుంది. వీటిలో ఏ ఒక్క శరీర భాగంలో సోరియాసిస్ తలెత్తినా, తలలో కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. అయితే ఈ వ్యాధిని నివారించుకునే సమర్థమైన మార్గాలు కొన్ని ఉన్నాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. అలర్జీ కారక ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, సమతులాహారం తీసుకోవడం, శుద్ధి చేసిన పదార్థాలు, పాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలకు దూరంగా ఉండడం అవసరం. అలాగే తేలికగా అరిగే ఆహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోవాలి. క్రమం తప్పక వ్యాయామం చేయాలి. ఈ నియమాలు పాటించగలిగితే ఉన్న సోరియాసిస్ అదుపులో ఉండడంతో పాటు కొత్తగా సోరియాసిస్ తలెత్తకుండా ఉంటుంది.

# గిల్‌కు రోహిత్, కోహ్లీ అండ ఉంటే వరల్డ్‌కప్‌లో భారత్‌కు తిరుగుండదు: రైనా

## పెద్ద టోర్నీల్లో అనుభవం కీలకమని వ్యాఖ్య

## వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ గొప్ప రికార్డులు ఉన్నట్లు వెల్లడి

## గిల్‌పై ప్రశంసలు కురిపించిన కుంబ్లే

## కెప్టెన్సీ ప్రభావం బ్యాటింగ్‌పై లేదన్న కుంబ్లే



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్లు అండగా ఉంటే జట్టుకు మరింత బలం చేకూరుతుందని చెప్పాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం ఎంతో కీలకమని పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి పెట్టారు. వరల్డ్‌కప్‌ల్లో ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని రైనా గుర్తు చేశాడు. 2019 వరల్డ్‌కప్‌లో రోహిత్ అత్యధిక పరుగులు సాధించగా, 2023 వరల్డ్‌కప్‌లో కోహ్లీ టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడని చెప్పాడు. ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన అనుభవం ఈ ఇద్దరి సొంతమని రైనా పేర్కొన్నాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

గిల్ తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టును నడిపించే అవకాశం ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో దోహదపడతాయని రైనా అన్నాడు. మైదానంలోనే కాకుండా బయట కూడా వారి అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని వివరించాడు. ఒత్తిడి ఎక్కువగా ఉండే టోర్నీల్లో ఇలాంటి సీనియర్లు మ్యాచ్ ఫలితాలను ప్రభావితం చేయగలరని పేర్కొన్నాడు.

మరోవైపు మాజీ కెప్టెన్, కోచ్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురిపించాడు.

కెప్టెన్సీ బాధ్యతలు వచ్చినా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం పడలేదని చెప్పాడు. ఐపీఎల్‌లోనూ గిల్ బౌలర్లను సమర్థంగా బరిలోకి దించాడని, ఒత్తిడిని సమర్థంగా అధిగమించాడని కొనియాడాడు.గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం మరో పెద్ద ప్లస్ పాయింట్ అని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో గిల్‌కు సహాయం లభిస్తుందని చెప్పాడు. అందుకే కెప్టెన్సీ భారం మొత్తం అతడిపై పడదని వ్యాఖ్యానించాడు.

# ముగియనున్న శకం.. మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్ లకు ఇదే ఆఖరి ప్రపంచకప్!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 పలువురు దిగ్గజాలకు చివరి టోర్నీ
- ఆఖరిసారి బరిలోకి దిగనున్న మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్ వంటి స్టార్స్
- 2022 విజేతగా నిలిచిన మెస్సీ టైటిల్ నిలబెట్టుకోవాలని ఆశ
- తన కెరీర్‌లో వరల్డ్ కప్ మాత్రమే గెలవని రొనాల్డోకు ఇది చివరి అవకాశం
- ఇదే తన చివరి ప్రపంచకప్ అని బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే ప్రకటన







**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 ఈ అర్ధరాత్రి తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. మరపురాని క్షణాలు, నాటకీయ ముగింపులతో అభిమానులను అలరించే ఈ మెగా టోర్నమెంట్, ఈసారి ఒక శకానికి ముగింపు పలకనుంది. కొన్ని దశాబ్దాలుగా ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏలిన ఎందరో దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్ కాబోతోంది. కోట్ల మందికి స్ఫూర్తినిచ్చిన ఈ తరం మేటి క్రీడాకారుల కెరీర్‌లో ఇది ఆఖరి అధ్యాయం కావచ్చు. వీరిలో కొందరు ఇప్పటికే ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడగా, మరికొందరు ఆ ఒక్క కల కోసం చివరిసారిగా పోరాడనున్నారు. ఈ నేపథ్యంలో, 2026 ప్రపంచకప్‌తో తమ కెరీర్‌కు ముగింపు పలకనున్న ఐదుగురు లెజెండరీ ఆటగాళ్లపై ఓ ప్రత్యేక కథనం.

**1. లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా)**

2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించి, ఫుట్‌బాల్ చరిత్రలో తనకంటూ ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్నాడు లియోనెల్ మెస్సీ. ఎనిమిది సార్లు బాలన్ డి'ఓర్ అవార్డు గెలుచుకున్న ఈ దిగ్గజ ఆటగాడికి బహుశా ఇదే చివరి ప్రపంచకప్ కానుంది. ఖతార్‌లో తన చిరకాల కలను నెరవేర్చుకున్న మెస్సీ, ఇప్పుడు మరో చారిత్రక ఘనతపై కన్నేశాడు. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా అర్జెంటీనాను నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం ఎలా సాగినా, ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా మెస్సీ స్థానం పదిలంగా ఉంటుంది.

**2. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్)**

రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తనదైన ముద్ర వేసిన క్రిస్టియానో రొనాల్డో, ఇప్పటికీ తన దేశానికి అతిపెద్ద స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. తన కెరీర్‌లో సాధించాల్సిన ట్రోఫీలన్నీ గెలిచినా, ప్రపంచకప్ మాత్రం అతనికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో, 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న రొనాల్డోకు తన కలను నెరవేర్చుకోవడానికి ఇది చివరి అవకాశం. ప్రపంచకప్ వేదికపై అతను ఆడే ప్రతి మ్యాచ్ ఆఖరిది కావచ్చనే భావనతోనే ఈ టోర్నీలో ఆడనున్నాడు.

**3. లూకా మోడ్రిచ్ (క్రొయేషియా)**

క్రొయేషియాను ఒక ఫుట్‌బాల్ శక్తిగా నిలబెట్టడంలో లూకా మోడ్రిచ్ పాత్ర కీలకం. 2018లో జట్టును ఫైనల్స్‌కు చేర్చడం నుంచి 2022లో మూడో స్థానంలో నిలపడం వరకు, క్లిష్ట సమయాల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఇప్పటికే 40 ఏళ్ల వయసులో ఉన్న మోడ్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు నాయకుడిగా, క్రియేటివ్ ఫోర్స్‌గా కొనసాగుతున్నాడు. 2026 ప్రపంచకప్‌లో జట్టును మరోసారి విజయపథంలో నడిపిస్తే, ఫుట్‌బాల్ చరిత్రలోని అత్యుత్తమ మిడ్‌ఫీల్డర్లలో ఒకడైన అతనికి అది సరైన వీడ్కోలు అవుతుంది.

**4. థామస్ ముల్లర్ (జర్మనీ)**

2014లో ప్రపంచకప్ గెలిచిన జర్మనీ జట్టులో కీలక సభ్యుడైన థామస్ ముల్లర్, టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించడంలో సిద్ధహస్తుడు. తన తెలివైన ఆటతీరు, కదలికలతో దశాబ్దానికి పైగా అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఫుట్‌బాల్ అగ్రశ్రేణిలో తమ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్న జర్మనీకి, 36 ఏళ్ల ముల్లర్ అనుభవం ఎంతో కీలకం. ఈ టోర్నీతో తన కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలని అతను భావిస్తున్నాడు.

**5. నెయ్‌మార్ (బ్రెజిల్)**

బ్రెజిల్ స్టార్ ఫార్వర్డ్ నెయ్‌మార్, 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని ఇప్పటికే సంకేతాలిచ్చాడు. ఫిఫా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అతని కెరీర్ ఫొటోలకు బదులిస్తూ, 'ది లాస్ట్ డ్యాన్స్'(ఇదే చివరిసారి) అని కామెంట్ చేశాడు. 128 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 79 గోల్స్‌తో బ్రెజిల్ తరపున ఆల్-టైమ్ టాప్ స్కోరర్‌గా ఉన్న 34 ఏళ్ల నెయ్‌మార్, 2023 అక్టోబర్‌లో గాయపడిన తర్వాత జట్టుకు దూరమయ్యాడు. అయితే, అతను జట్టులోకి తిరిగి చేరి, గత 24 ఏళ్లుగా ఆరో ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్న బ్రెజిల్ కలను నెరవేర్చాలని పట్టుదలతో ఉన్నాడు.

'క్యాజువల్ గ్లామ్' లుక్‌లో మెరిసిపోతున్న ఐశ్వర్య రాజేష్ - రిలాక్స్డ్ అండ్ చిక్ శైలిలో సత్తా చాటుతున్న నటి



# మరో క్యాచీ టైటిల్ ను పట్టేసిన శ్రీవిష్ణు



తెలుగు సినీ పరిశ్రమలో కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు ప్రస్తుతం మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సామజవరగమన వంటి సూపర్ హిట్ సినిమాను అందించిన డైరెక్టర్ రామ్ అబ్బరాజుతో ఆయన మరోసారి చేతులు కలపడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.తాజాగా ఈ సినిమాకు ఫ్యామిలీ ప్యాక్ అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ బయటికి వచ్చినప్పటి నుంచే సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ కనిపిస్తోంది. ముఖ్యంగా అటు ఫ్యామిలీ ఆడియన్స్ ను, ఇటు యూత్ ను టార్గెట్ చేస్తూ, ఎంటర్టైన్మెంట్ మరియు ఎమోషన్స్ ను కలగలిపే కథతో ఈ సినిమా రూపొందనున్నట్లు తెలుస్తోంది. టైటిల్ వినగానే ఇది పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనే భావన కలుగుతుండటంతో సినిమాపై సహజంగానే ఆసక్తి పెరిగింది.శ్రీవిష్ణు కెరీర్‌ను గమనిస్తే సరైన కథలు, కొత్త కాన్సెప్టులు ఎంచుకోవడమే అతని బలం. అదే విధంగా రామ్ అబ్బరాజు కూడా కామెడీని కుటుంబ కథలతో మేళవించి ప్రేక్షకులను ఆకట్టుకునే డైరెక్టర్ గా పేరు సంపాదించుకున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సామజవరగమన సినిమా ఎలాంటి భారీ అంచనాలు లేకుండానే విడుదలై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసింది. తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఆ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుని కల్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలిచింది. ఆ తర్వాత రామ్ అబ్బరాజు తెరకెక్కించిన నారీ నారీ నడుమ మురారి కూడా సంక్రాంతి సీజన్‌లో మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయన సినిమాపై ఆడియన్స్ కు మరింత నమ్మకం ఏర్పడింది. వరుస సక్సెస్‌ల తర్వాత ఆయన మళ్లీ శ్రీవిష్ణుతో సినిమా చేయడం, పైగా ఫ్యామిలీ ప్యాక్ వంటి గుర్తుండిపోయే టైటిల్‌ను ఎంపిక చేయడం ప్రాజెక్ట్‌కు అదనపు ఆకర్షణగా మారింది.ప్రస్తుతం టాలీవుడ్‌లో టైటిల్ కూడా సినిమాకు తొలి ప్రమోషన్‌గా మారిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఆ విషయంలో శ్రీవిష్ణు టీమ్ సరైన నిర్ణయం తీసుకున్నట్లు సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్యామిలీ ప్యాక్ అనే పేరు వినగానే అందరికీ సులభంగా గుర్తుండిపోవడంతో పాటు సినిమాలో ఎంటర్టైన్మెంట్ గ్యారెంటీ అనే సంకేతాన్ని ఇస్తోంది. శ్రీవిష్ణు గత కొన్నేళ్లుగా ప్రేక్షకుల అభిరుచిని అర్థం చేసుకుని కథలను ఎంచుకుంటున్న తీరు కూడా ఈ ప్రాజెక్ట్‌పై నమ్మకాన్ని పెంచుతోంది. ఇక రామ్ అబ్బరాజు తన గత రెండు సినిమాలతో ఫ్యామిలీ ఆడియన్స్ నాడిని బలంగా పట్టుకున్న డైరెక్టర్ గా నిరూపించుకోవడంతో ఈ కాంబినేషన్ నుంచి మరో విజయవంతమైన ఎంటర్‌టైనర్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. షూటింగ్ ప్రారంభానికి ముందే టైటిల్‌తోనే చర్చల్లోకి వచ్చిన ఫ్యామిలీ ప్యాక్ రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తికర మైన ఫ్యామిలీ ఎంటర్‌టై నర్లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి.

దివి వద్స్య సొగసైన మెరుపు: కొత్త ఫోటోషూట్‌లో పింక్ లేస్ దుస్తుల్లో అద్భుతమైన రూపం



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965